PRGI NO : TGTEL/26/A2002
EDITOR: PEMBI MAHENDHAR

# నవగీతం

NAVAGEETAM DINAPATHRIKA
తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | సంపుటి : 1 | సంచిక : 22 | పేజీలు : 8 | ఆదివారం 14 జూన్ 2026 | వెల : 4/-




## భారత్ నిర్ణయంతో పాక్ అల్లకల్లోలం!



- సుక్కూర్ బ్యారేజ్‌లో పడిపోయిన నీటిమట్టం
- బలూచ్, సింధ్ ప్రావిన్స్‌ల్లో ప్రమాదకర పరిస్థితులు!
- సింధూ జలాల ఒప్పందం నిలిపివేత ప్రభావం పాక్‌పై తీవ్రం
- సుక్కూర్ బ్యారేజ్ పరిధిలో కాలువలు ఎండిపోవడంతో రైతుల ఆందోళన
- సింధ్‌కు నీరు అందకపోతే పాక్ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావమని నిపుణుల హెచ్చరిక

## నైరుతి రుతుపవనాల రాకతో వర్షాలు



- ఈదురుగాలుల ప్రభావంతో జంటనగరాల్లో ముగ్గురు మృతి
- ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తడిసిన వడ్లు
- ప్రతికూల వాతావరణంతో శంషాబాద్ విమానాశ్రయంలో దారిమళ్లింపు
- 9 విమానాల మళ్లింపుతో తీవ్ర ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు

# హస్తంలో కల్లోలం



- కాంగ్రెస్‌లో 'ఆడియో' కలకలం
- కోవర్టు వ్యవహారం ముగియక ముందే మరో కలవరం
- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మాట్లాడిన మాటలంటూ వైరల్
- కాంగ్రెస్ పార్టీ అమ్ముడుపోయే పార్టీగా మారిందనే వ్యాఖ్యలు
- పీసీసీ చీఫ్ పేరు ప్రస్తావన.. వివరణ కోరిన క్రమశిక్షణ కమిటీ
- మహిళల పరువు తీసేలా ఎవరూ వ్యాఖ్యానాలు చేయకూడదన్న మహేశ్‌గౌడ్

హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీలో ఓ ఆడియో తీవ్ర కలకలం రేపుతోంది. నిజామాబాద్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకుడితో ఆ పార్టీ సీనియర్ నేత, సీఎం రేవంత్ సన్నిహితుడు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ మాట్లాడినట్టుగా ఉన్న ఈ ఆడియో ఇప్పుడు వైరల్ అవుతోంది. మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ అంశంలో పార్టీలోని కోవర్టుల వ్యవహారం ఇంకా ముగియక ముందే..పార్టీని, పీసీసీ అధ్యక్షుడిని ఉద్దేశించి షబ్బీర్ అలీ అనుచిత వ్యాఖ్యలు చేసినట్టుగా ఉన్న ఆ ఆడియో గాందీభవన్ వర్గాల్లో సంచలనం సృష్టిస్తోంది. రంగంలోకి దిగిన టీపీసీసీ షబ్బీర్ అలీని వివరణ కోరింది. ఢిల్లీ పెద్దలు సైతం దీనిపై ఆరా తీసినట్టు తెలుస్తోంది. ఆవేదన, పరామర్శ కోణంలోనే - మిగతా3లో



## ఐక్యంగా ఉండి ప్రజలను సంఘటితం చేస్తాం

- 2029 లోక్‌సభ ఎన్నికల్లో 'ఇండి' కూటమి ఆల్రెడీ గెలిచేసింది
- 2029 ఎన్నికలపై రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు
- ఇండి కూటమిలో లోక్‌సభ ప్రతిపక్షనేత స్పీచ్
- పోటీలో గెలవడానికి నిష్పక్షపాతమైన ఎన్నికలే లేవని వ్యాఖ్యలు!
- అలాగే బీజేపీని, అది భారతదేశ వ్యవస్థలను తన గుప్పిట్లోకి తీసుకోవడంపై మేం ప్రతిఘటిస్తాం"



## పంజాబ్‌లో ఒంటరిగానే బీజేపీ పోరు

- 117 స్థానాల్లో పోటీకి సిద్ధం!
- 2027 పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తులు ఉండవని స్పష్టం చేసిన బీజేపీ
- అన్ని 117 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తామని ప్రకటించిన పంజాబ్ బీజేపీ నేతలు

## గగనతల రక్షణ వ్యవస్థకు ఎయిర్‌ఫోర్స్ కీలకం



- దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో గ్రాడ్యుయేషన్ పరేడ్‌కు హాజరైన రాజ్‌నాథ్‌సింగ్
- పరేడ్‌లో ఆకర్షణగా నిలిచిన సుఖోయ్, సూర్యకిరణ్, సారంగ్ విన్యాసాలు
- యుద్ధంలో సాంకేతిక వినియోగం చాలా పెరిగింది
- సాంకేతిక వినియోగాన్ని అధికారులు అందిపుచ్చుకోవాలి
- ఆపరేషన్ సింధూర్‌లో ఎయిర్ వారియర్స్ కీలక పాత్ర పోషించారు.
- దేశ రక్షణ కోసం ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి

హైదరాబాద్


దేశ రక్షణ కోసం ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో జరిగిన గ్రాడ్యుయేషన్ పరేడ్‌కు రివ్యూయింగ్ ఆఫీసర్‌గా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్‌సింగ్ మాట్లాడారు. గగనతల రక్షణ వ్యవస్థకు ఎయిర్ ఫోర్స్ చాలా కీలకమని పేర్కొన్నారు. యుద్ధంలో సాంకేతిక వినియోగం చాలా పెరిగిందని, సాంకేతిక వినియోగాన్ని అధికారులు అందిపుచ్చుకోవాలని సూచించారు. ఆపరేషన్ సింధూర్‌లో ఎయిర్ వారియర్స్ కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. ఈ ప్రస్తుత టెక్నాలజీ ప్రపంచంలో అనునిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. - మిగతా3లో



## ఆర్థిక, సాంస్కృతిక సంబంధాల బలోపేతమే లక్ష్యం

- ఫ్రాన్స్, స్లోవేకియా పర్యటనకు ప్రధాని మోదీ
- ఫ్రాన్స్, స్లోవేకియా దేశాలకు అధికారిక పర్యటనకు బయలుదేరిన ప్రధాని మోదీ
- ఆర్థిక, సాంకేతిక, సాంస్కృతిక సహకారాల విస్తరణపై ప్రధాన దృష్టి
- భారత్, ఫ్రాన్స్ స్పెషల్ గ్లోబల్ స్ట్రాటజిక్ పార్ట్నర్‌షిప్ సమీక్ష

## హెల్త్ కేర్ ఇన్నోవేషన్స్ కేంద్రంగా హైదరాబాద్




- రాబోయే ముప్పును ముందే అంచనా వేసే స్థాయికి వైద్య రంగం
- ఏఐ ఎప్పటికీ వైద్యుడికి ప్రత్యామ్నాయం కాదు
- ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఏఐ ఇన్ హెల్త్ కేర్'లో మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్

హెల్త్ కేర్ ఇన్నోవేషన్స్ కేంద్రంగా హైదరాబాద్‌ను ప్రపంచ పటంలో నిలపాలన్నదే తమ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. రాష్ట్రంలో నూతన ఆవిష్కరణలకు ఊతమిచ్చేలా, ఆవిష్కర్తలను ప్రోత్సహించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన 'ఎకో సిస్టం'ను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. హైటెక్ సిటీలోని యశోదా ఆసుపత్రిలో రెండ్రోజుల పాటు నిర్వహించనున్న 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఏఐ ఇన్ హెల్త్ కేర్'ను - మిగతా3లో

# భారత్ నిర్ణయంతో పాక్ అల్లకల్లోలం!

పహల్గాం ఉగ్రదాడి తర్వాత సింధూ జలాల ఒప్పందాన్ని నిలిపివేస్తూ భారత్ తీసుకున్న నిర్ణయం ఇప్పుడు పాకిస్థాన్‌ను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టేస్తోంది. ఉగ్రవాదానికి ఆశ్రయం కల్పించే దేశంతో సాధారణ సంబంధాలు కొనసాగబోవని స్పష్టం చేసిన భారత్, సింధూ జలాల విషయంలోనూ కఠిన వైఖరినే కొనసాగిస్తోంది. దీంతో పాకిస్థాన్‌లో ఇప్పటికే కనిపిస్తున్న నీటి సంక్షోభం మరింత తీవ్రమవుతోందని అక్కడి మీడియా వర్గాలు వెల్లడిస్తున్నాయి. ప్రధానంగా సింధ్, బలూచిస్థాన్ ప్రావిన్స్‌లలో పరిస్థితులు ఆందోళనకరంగా మారాయి. లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించే సుక్కూర్ బ్యారేజ్ పరిధిలో నీటి మట్టాలు ప్రమాదకరంగా పడిపోయినట్లు తెలుస్తోంది. పాకిస్థాన్‌లోనే అతిపెద్ద నీటిపారుదల వ్యవస్థల్లో ఒకటైన ఈ బ్యారేజ్‌పై కోట్లాది మంది జీవనాధారం ఆధారపడి ఉంది. అయితే ప్రస్తుతం కాలువల్లో నీటి లభ్యత గణనీయంగా తగ్గిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



**రైతుల ఆవేదన**

సుక్కూర్ బ్యారేజ్1 పరిధిలోని ప్రధాన కాలువల్లో భారీగా నీటి కొరత నమోదైంది. దాదూ కెనాల్‌లో 82 శాతం, నార్త్ వెస్టర్న్ కెనాల్‌లో 64.1 శాతం, రైస్ కెనాల్‌లో 38 శాతం మేర నీటి లోటు ఏర్పడినట్లు స్థానిక వర్గాలు చెబుతున్నాయి. దాదూ కెనాల్‌కు కేటాయించిన నీటిలో స్వల్ప భాగమే చేరుతుండగా, నార్త్ వెస్టర్న్, రైస్ కాలువల్లోనూ పరిస్థితి ఇదే విధంగా ఉంది. దీంతో ఖరీఫ్ సాగు పనులు ప్రారంభించలేక రైతులు చేతులెత్తేస్తున్నారు. వరి నర్సరీలు సిద్ధం చేయడానికే నీరు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇక నీటి కొరతకు తోడు పాకిస్థాన్‌లోని ప్రావిన్స్‌ల మధ్య వివాదాలు మరింత ముదురుతున్నాయి. తమకు రావాల్సిన నీటిని పంజాబ్ ప్రావిన్స్ అక్రమంగా వినియోగిస్తోందని సింధ్ ప్రభుత్వం ఆరోపిస్తోంది. పంజాబ్‌కు కేటాయించిన 44 వేల క్యూసెక్కుల నీటికి బదులుగా 53 వేల 394 క్యూసెక్కుల నీటిని వాడుకుంటోందని, అంటే 21 శాతం అదనంగా తీసుకుంటోందని విమర్శిస్తోంది. అదే విధంగా తౌన్సా బ్యారేజ్ వద్ద కూడా కేటాయింపుల కంటే 9.3 శాతం అధికంగా నీటిని మళ్లిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. మరోవైపు చష్మా బ్యారేజ్ వద్ద నీటి మట్టాలు పెరుగుతున్నప్పటికీ దిగువ ప్రాంతమైన సింధ్‌కు మాత్రం తగినంత నీటిని విడుదల చేయడం లేదని అక్కడి నేతలు మండిపడుతున్నారు. ఉద్దేశపూర్వకంగానే సింధ్‌పై వివక్ష చూపుతున్నారని ఆరోపిస్తున్నారు. ఈ పరిణామాలు పాకిస్థాన్‌లో రాజకీయ దుమారానికీ కారణమయ్యాయి. కరాచీలో ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న నీటి సమస్యను పరిష్కరించడంలో పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ నేతృత్వంలోని సింధ్ ప్రభుత్వం విఫలమైందని జమాత్-ఎ-ఇస్లామీ పార్టీ తీవ్ర విమర్శలు చేసింది. అధికారంలో ఉండి ప్రజల సమస్యలను పట్టించుకోలేదని ఆరోపించింది. అయితే ఈ విమర్శలను పీపీపీ తిప్పికొడుతోంది. ఫెడరల్ వాటర్ మేనేజర్ల అసమర్థత, కేంద్ర ప్రభుత్వ వైఫల్యాల వల్లే సింధ్ ఈ పరిస్థితిని ఎదుర్కొంటోందని పీపీపీ సింధ్ అధ్యక్షుడు నిసార్ అహ్మద్ ఖుహ్రో ఎదురుదాడికి దిగారు. దేశ వ్యవసాయోత్పత్తిలో అత్యధిక వాటా అందించే సింధ్‌కు తగిన నీటి వాటా ఇవ్వకపోవడం ఆర్థిక మారణహోమమేనని ఆయన వ్యాఖ్యానించారు.

సింధ్ ప్రావిన్స్ పాకిస్థాన్ వ్యవసాయ రంగానికి వెన్నెముకగా నిలుస్తోంది. ప్రతి ఏటా సుమారు 55 లక్షల టన్నుల వరి ధాన్యం అక్కడ పండుతుంది. బియ్యం ఎగుమతుల ద్వారా దాదాపు 1.4 బిలియన్ డాలర్ల విదేశీ మారకద్రవ్యాన్ని సమకూరుస్తోంది. దేశ వ్యవసాయోత్పత్తిలో దాదాపు 67 శాతం వాటా ఈ ప్రాంతానిదేనని పాకిస్థాన్ నేతలే చెబుతున్నారు. అలాంటి కీలక ప్రాంతంలో సాగునీటి కొరత కొనసాగితే రైతులు తీవ్ర నష్టాలు చవిచూడటమే కాకుండా పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థపైనా భారీ ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వ్యవసాయ దిగుబడులు తగ్గిపోతే ఆహార భద్రత, ఉపాధి, ఎగుమతులు అన్నీ దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్ అవలంబించిన కఠిన వైఖరి, ఇప్పుడు పాకిస్థాన్‌లోని జలవనరుల నిర్వహణ లోపాలు, అంతర్గత విభేదాలను మరింత బహిర్గతం చేస్తోంది. ఒకవైపు భారత్ తన నిర్ణయంపై వెనక్కి తగ్గే సూచనలు కనిపించకపోగా, మరోవైపు పాక్‌లో నీటి పంపిణీ వివాదాలు రోజురోజుకూ ముదురుతున్నాయి. ఈ పరిస్థితుల్లో సింధూ జలాల సంక్షోభం పాకిస్థాన్‌కు రానున్న రోజుల్లో మరింత పెద్ద సవాల్‌గా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# పంజాబ్‌లో ఒంటరిగానే బీజేపీ పోరు

పంజాబ్‌లో 2027 అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్నికలకు ముందు ఎలాంటి పొత్తులు ఉండవని స్పష్టం చేసిన బీజేపీ, రాష్ట్రంలోని మొత్తం 117 అసెంబ్లీ స్థానాల్లో సొంతంగా పోటీ చేస్తామని ప్రకటించింది. ప్రస్తుతం ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధికారంలో ఉన్న పంజాబ్‌లో ఈసారి అధికారాన్ని కైవసం చేసుకోవడమే లక్ష్యంగా పార్టీ వ్యూహాలు రచిస్తోంది. శనివారం దిల్లీలో పంజాబ్ బీజేపీ కీలక నేతల సమావేశం జరిగింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పంజాబ్ రాజకీయ పరిస్థితులు, రానున్న అసెంబ్లీ ఎన్నికల వ్యూహాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశానికి పంజాబ్ బీజేపీ అధ్యక్షుడు కేవల్ సింగ్ ధిల్లాన్‌తో పాటు సునీల్ జాఖర్, కేంద్ర మంత్రి రవ్నీత్ సింగ్ బిట్టు, రాణా గుర్మీత్ సింగ్ సోఢీ, మన్‌ప్రీత్ సింగ్ బాదల్, తరుణ్ చుగ్, అశ్వనీ శర్మ, ఇక్బాల్ సింగ్ లాల్‌పురా, పరమిందర్ సింగ్ బ్రార్, ఫతేజంగ్ సింగ్ బజ్వా తదితరులు హాజరయ్యారు.



**వికసిత్ భారత్ లక్ష్య సాధన దిశగా!**

సమావేశం అనంతరం మాట్లాడిన బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్, పంజాబ్ ప్రస్తుత రాజకీయ పరిస్థితులతో పాటు రాష్ట్ర భవిష్యత్తుపై సీరియస్‌గా చర్చించినట్లు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో ప్రజల ముందుకు ఎలాంటి అంశాలతో వెళ్లాలన్న దానిపై స్పష్టమైన కార్యాచరణ రూపొందించినట్లు చెప్పారు. పంజాబ్ యువతను నాశనం చేస్తున్న మాదకద్రవ్యాల వ్యాపారాన్ని మూలాలతో సహా నిర్మూలించడం తమ తొలి ప్రాధాన్యమని ఆయన పేర్కొన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, రైతులు, వ్యాపారులు, ఉద్యోగుల హక్కులను కాపాడటం, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిపాదించిన వికసిత్ భారత్ లక్ష్య సాధన దిశగా పనిచేస్తామని వెల్లడించారు.

పంజాబ్ బీజేపీ అధ్యక్షుడు కేవల్ సింగ్ ధిల్లాన్ మాట్లాడుతూ, ప్రస్తుతం పొత్తుల అంశం చర్చలోనే లేదని స్పష్టం చేశారు. బీజేపీ మొత్తం 117 స్థానాల్లో పోటీ చేసి విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పంజాబ్ అభివృద్ధే తమ ఏకైక అజెండా అని, రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు.మాజీ ఆర్థిక మంత్రి, బీజేపీ నేత మన్‌ప్రీత్ సింగ్ బాదల్ మాట్లాడుతూ, పంజాబ్ ఎదుర్కొంటున్న ఆర్థిక, సామాజిక సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. రాష్ట్రం కోల్పోయిన వైభవాన్ని తిరిగి తీసుకురావడమే లక్ష్యమని చెప్పారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఒకే పార్టీ అధికారంలో ఉండే "డబుల్ ఇంజిన్" ప్రభుత్వంతో అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని అభిప్రాయపడ్డారు.

ఇక సునీల్ జాఖర్ మాట్లాడుతూ, ఆప్ ప్రభుత్వం కాంగ్రెస్‌తో కలిసి పంజాబ్‌ను దోచుకుంటోందని ఆరోపించారు. రాష్ట్రాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రజలకు ప్రత్యామ్నాయంగా బీజేపీని బలమైన శక్తిగా నిలబెట్టే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని తెలిపారు. బీజేపీ నేత పరమిందర్ సింగ్ బ్రార్ మాట్లాడుతూ, ఇతర రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వాలు సాధించిన అభివృద్ధి పనులను, పార్టీ విజన్‌ను పంజాబ్ ప్రజల ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. తమ పాలనలో అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి నమూనాలను ప్రజలకు వివరిస్తామని తెలిపారు.

**సామాన్య ప్రజల పరిస్థితి ఏంటి?**

మరోవైపు పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్‌పై కూడా బీజేపీ నేతలు తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టారని ఆరోపించారు. రాష్ట్రంలో పోలీసులకే భద్రత లేకపోతే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. పరిస్థితిని చక్కదిద్దుకునేందుకు ప్రస్తుత ప్రభుత్వానికి ఇక తక్కువ సమయమే మిగిలి ఉందని వ్యాఖ్యానించారు. ఈ సమావేశం ఇటీవల జరిగిన పంజాబ్ మున్సిపల్ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ప్రాధాన్యం సంతరించుకుంది. మొత్తం 1,977 వార్డుల్లో ఆప్ 958 వార్డులను గెలుచుకుని తన ఆధిపత్యాన్ని చాటుకుంది. కాంగ్రెస్ 397 వార్డుల్లో విజయం సాధించగా, శిరోమణి అకాలీ దళ్ 191 వార్డులు గెలుచుకుంది. బీజేపీ 172 వార్డుల్లో మాత్రమే విజయం సాధించింది. అయితే ఈ ఫలితాలను అధిగమించి అసెంబ్లీ ఎన్నికల్లో బలమైన పోటీ ఇవ్వాలనే లక్ష్యంతో బీజేపీ ముందుకెళ్తోంది. పొత్తులపై ఆధారపడకుండా సొంత బలంతో ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయించుకుంది.

# ఆర్మీ చీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్ నియామకం

భారత తదుపరి ఆర్మీ చీఫ్?గా లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్ నియామకమయ్యారు. ఈ మేరకు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆర్మీ చీఫ్‌గా ఉన్న జనరల్ ఉపేంద్ర ద్వివేది పదవీ విరమణ కానున్న నేపథ్యంలో ధీరజ్ సేథ్ ఆ బాధ్యతలను చేపట్టనున్నారు. ఈనెల 30న లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్ ఆర్మీ చీఫ్?గా బాధ్యతలు బాధ్యతలు స్వీకరిస్తారు. ప్రస్తుతం వైస్ చీఫ్ ఆఫ్ ది ఆర్మీ స్టాఫ్?గా ఉన్న ఆయనకు సైనిక వ్యూహాల్లో అపారమైన అనుభవం ఉంది. ధీరజ్ సేథ్ నేషనల్ డిఫెన్స్ అకాడమీ పూర్వ విద్యార్థి. ఆయన డిసెంబర్ 1986లో భారత సైన్యంలోని ఆర్మర్డ్ సాయుధ దళంలో చేరారు. దాదాపు 40 ఏళ్ల సుదీర్ఘ కాలంలో ఆయన సైన్యంలోని వివిధ విభాగాల్లో, పలు ప్రాంతాల్లో పనిచేశారు. ధీరజ్ సేథ్ తన కెరీర్‌లో కొన్ని కీలకమైన బాధ్యతలను నిర్వహించారు. ఎడారి సరిహద్దుల్లోని ఒక కీలకమైన ఆర్మర్డ్ రెజిమెంట్‌కు నాయకత్వం వహించారు. పశ్చిమ ఆర్మర్డ్ బ్రిగేడ్ కమాండర్‌గా బాధ్యతలను నిర్వహించారు. జమ్ముకశ్మీర్ ప్రాంతంలో ఉగ్రవాద నిరోధక దళం కమాండర్‌గా పనిచేశారు. ఉగ్రవాదులను నిర్మూలించడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణలో కీలకంగా వ్యవహరించారు.



లెఫ్టినెంట్ జనరల్ హోదా పదోన్నతి పొందిన తరువాత భారత సైన్యానికి చెందిన అత్యంత శక్తివంతమైన ప్రధాన స్ట్రైక్ ఫార్మేషన్లలో ఒకటైన 'సుదర్శన్ చక్ర కోర్'కు కమాండర్‌గా వ్యవహరించడం ధీరజ్ సేథ్ కెరీర్‌లో కీలకమైన ఘట్టంగా చెప్పుకోవాలి. యుద్ధ వేళల్లో శత్రువులపై మెరుపుదాడి చేసే వ్యూహాలను రూపొందించడంలో 'సుదర్శన్ చక్ర కోర్ అత్యంత కీలకమైనది. ధీరజ్ సేథ్ కెరీర్‌లో అరుదైన గుర్తింపులను సొంతం చేసుకున్నారు. ఆర్మీ కమాండర్‌గా పదోన్నతి పొందిన తర్వాత భారత సైన్యంలోని రెండు అత్యంత కీలకమైన సౌత్ వెస్ట్రన్ కమాండ్, సదరన్ కమాండ్‌గా పని చేశారు. భారత ఆర్మీలో ఇలాంటి అవకాశం చాలా తక్కువ మంది అధికారులకు లభించింది.

**ఆపరేషన్ సింధూర్‌లోనూ**

పలు ఆపరేషన్‌లకు సంబంధించిన ప్రణాళికలు, దళాల నిర్వహణ, సైనిక సామర్థ్యాల అభివృద్ధిలో ధీరజ్ విశేషమైన కృషిచేశారు. గతేడాది పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత సైన్యం అత్యంత వ్యూహాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ సింధూర్ సమయంలో పుణె కేంద్రంగా ఉన్న సదరన్ కమాండ్‌కు ధీరజ్ నాయకత్వం వహించారు. అనంతరం పశ్చిమ సరిహద్దు వెంబడి నిర్వహించిన త్రివిధ దళాల సంయుక్త విన్యాసాలను సమన్వయం చేశారు. ముఖ్యంగా రాజస్థాన్ ఎడారి ప్రాంతంలో జరిగిన అతిపెద్ద త్రివిధ దళాల సంయుక్త విన్యాసం "ఎక్సర్‌సైజ్ త్రిశూల్"కు ఆయన పర్యవేక్షించారు. అంగోలాలోని ఐక్యరాజ్యసమితి శాంతి భద్రతా మిషన్‌లోనూ ఆయన సేవలందించారు. అలాగే, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను, భవిష్యత్ యుద్ధరంగంతో సమన్వయం చేయడంలో ఆయన చేసిన సేవలు కీలకమైనవి.

**ఇక ఉపేంద్ర ద్వివేది విషయానికొస్తే,**

భారత సైన్యాధిపతిగా విశేషమైన సేవలు అందించిన జనరల్ ఉపేంద్ర ద్వివేది, 2024 జూన్‌లో 30వ భారత ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ ఏడాది జూన్ 30న పదవీ విరమణ చేయనున్నారు. దాదాపు 4 దశాబ్దాల పాటు సాగిన ఆయన మిలిటరీ కెరీర్‌లో ఎన్నో కీలక బాధ్యతలు చేపట్టారు. ఎన్నో కీలక ఆపరేషన్?లలో పాల్గొన్నారు. శత్రుమూకల ఆట కట్టించేందుకు, భవిష్యత్తులో వచ్చే ముప్పులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఆయన విశేషమైన కృషి చేశారు. చైనా, పాకిస్థాన్? సరిహద్దుల్లో రక్షణ వ్యూహాలను పర్యవేక్షించారు. కొన్ని సందర్భాల్లో పాకిస్థాన్?కు గట్టి హెచ్చరికలు చేశారు. సరిహద్దుల్లో ఉగ్రవాదానికి మద్దతు ఇస్తే తీవ్ర పరిణామాలుంటాయని, పాకిస్థాన్ ప్రపంచపటంలో ఉండాలనుకుంటే సీమాంతర ఉగ్రవాదాన్ని ఆపివేయాలని ఇటీవల ఆయన వార్నింగ్ ఇచ్చారు. ఇక, అమెరికాలోని ప్రతిష్టాత్మకమైన 'యూఎస్ ఆర్మీ వార్ కాలేజ్– ఇంటర్నేషనల్ హాల్ ఆఫ్ ఫేమ్'లో ఆయనకు చోటు దక్కింది. అంతేకాదు, ఈ అరుదైన గౌరవాన్ని దక్కించుకున్న మూడో భారత సైనికాధికారిగా ఆయన నిలిచారు.

## ఐక్యంగా ఉండి ప్రజలను సంఘటితం చేస్తాం

2029 ఎన్నికలపై లోక్‌సభ ప్రతిపక్షనేత, ఎంపీ రాహుల్ గాంధీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'ఇండియా' కూటమి 2029 ఎలక్షన్స్‌లో ఇప్పటికే విజయం సాధించిందని అన్నారు. గత సోమవారం దిల్లీలో జరిగిన ఇండి కూటమిలో తాను చేసిన ప్రసంగాన్ని రాహుల్ గాంధీ శనివారం షేర్ చేసుకున్నారు. ఈ క్రమంలో ఇండి కూటమిలో ఐక్యత ఆవశ్యకతను నొక్కి చెప్పారు. అలాగే తాము 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోలేదని, 2029 ఎన్నికల్లో ఇప్పటికే విజయం సాధించామని ఆయన పేర్కొన్నారు.



**ప్రసంగాన్ని అనువాదం చేసిన రాహుల్**

ఇటీవల జరిగిన ఇండి కూటమి సమవేశంలో తాను హిందీలో ప్రసంగం చేశానని చెప్పారు. అయితే దానిని కూటమి మిత్రపక్షాలు అనువాదం చేయమని అడిగాయని అందుకే ఆ స్పీచ్‌ను ట్రాన్స్లేట్ చేసి ఇవాళ అందిస్తున్నట్లు రాహుల్ గాంధీ పేర్కొన్నారు. జూన్ 8న జరిగిన కూటమి సమావేశంలో 20 మందికి పైగా నాయకుల ప్రసంగాలు, వ్యాఖ్యలు విన్న తర్వాత చివరగా తాను ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలిపారు. "భారతదేశ ఆలోచనా విధానం, దేశ ఆత్మ సంక్షోభంలో ఉన్నప్పుడు, వ్యవస్థలు హస్తగతం చేసుకున్నప్పుడు, ప్రజల గొంతుక అణచివేసినప్పుడు, ఐక్యతతో కూడిన ప్రతిఘటన మాత్రమే ప్రభావవంతంగా పనిచేస్తుంది. నేను మళ్లీ చెబుతున్నా, మేం 2024 ఎన్నికల్లో ఓడిపోలేదు. ఇక 2029 ఎన్నికల్లోనూ మేం ఇప్పటికే విజయం సాధించాం. ఐక్యంగా ఉండి ప్రజలను సంఘటితం చేస్తాం. అలాగే బీజేపీని, అది భారతదేశ వ్యవస్థలను తన గుప్పిట్లోకి తీసుకోవడంపై మేం ప్రతిఘటిస్తాం" అని ఇండి కూటమి మీటింగ్?లో తన హిందీ ప్రసంగాన్ని ట్రాన్స్లేట్ చేస్తూ రాహుల్ ఎక్స్‌లో ట్వీట్ షేర్ చేశారు.

అలాగే దేశ ప్రజలు ప్రస్తుతం అధికార ఎన్‌డీఏపై తీవ్రమైన ఆగ్రహంతో ఉన్నారని, అది చూస్తే రానున్న 2029 పార్లమెంట్ ఎన్నికల్లో విజయం విజయం తమదే అని కూటమి పక్షాలతో రాహుల్ చెప్పారు. అయితే స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాతమైన ఎన్నికలు జరగకపోవడం వల్లే పోటీలో గెలవలేకపోతున్నామని అన్నారు. ఈ క్రమంలోనే ప్రతిపక్ష నాయకులు ఐక్యంగా ఉండాలని గాంధీ పిలుపునిచ్చారు. కూటమిలోని అందరూ కలిసి నిలబడి ప్రతిఘటిస్తే, అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ (బీజేపీ)ని సులభంగా ఓడించవచ్చని రాహుల్ అన్నారు.

ఇటీవల తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్ పార్టీ టీవీకేకు మద్దతు ఇవ్వడంతో ఇండి కూటమికి డీఎంకే దూరమైందని ప్రచారం జరుగుతోంది. ఈ సందర్భంగా దీనిపైనా రాహుల్ స్పందించారు. ప్రతిపక్ష పార్టీల మధ్య సమన్వయం లేదన్న అభిప్రాయాన్ని రాహుల్ తోసిపుచ్చారు. ఇదంతా బీజేపీ చేస్తున్న ఫేక్ ప్రచారం అని అన్నారు. 'ఇవి బీజేపీ చేస్తున్న ఫేక్ ప్రచారాలు. ఇందులో ఏ మాత్రం నిజం లేదు. డీఎంకే విషయంలో నేను ఇప్పుడే హామీ ఇవ్వగలను. భారతదేశ భావనను కాపాడే విషయానికి వస్తే, ఈ కూటమిలో ఉన్న ప్రతి ఒక్కరూ కలిసి వస్తారని నాకు 100 శాతం నమ్మకం ఉంది' అని రాహుల్ పేర్కొన్నారు.

## 'ఆర్థిక, సాంస్కృతిక సంబంధాల బలోపేతమే లక్ష్యం'

ఐరోపా దేశాలతో సంబంధాలను మరింత బలోపేతం చేసుకునే దిశగా శనివారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విదేశీ పర్యటనకు బయలుదేరారు. వారం రోజుల పాటు ఫ్రాన్స్, స్లోవేకియాలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో రెండు దేశాలతో ఉన్న వ్యూహాత్మక, ఆర్థిక, సాంస్కృతిక సంబంధాలను మరింత బలోపేతం చేయడమే ప్రధాన లక్ష్యంగా ఉంది. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మెక్రాన్, స్లోవేకియా ప్రధాని రాబర్ట్ ఫికో ఆహ్వానం మేరు ఈ రెండు దేశాలు పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా మొదటిగా ప్రధాని మోదీ, ఫ్రాన్స్‌లోని నీస్ నగరాన్ని సందర్శించి అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మెక్రాన్?తో సమావేశం కానున్నారు. ఈ భేటీలో భారత్--ఫ్రాన్స్ సంబంధాల మొత్తం పరిధిని సమీక్షించనున్నారు. తన ప్రయాణానికి ముందు విడుదల చేసిన ప్రకటనలో మోదీ, ఫ్రాన్స్ భారత్ వ్యూహాత్మక దృష్టిలో ప్రత్యేక స్థానం కలిగి ఉందని పేర్కొన్నారు. ఇరుదేశాల మధ్య ఉన్న సంబంధాలు గతంలో మరింత బలపడినట్లు ఆయన తెలిపారు. ఇటీవల ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్?తో భారత్ పర్యటన చేసిన విషయాన్ని గుర్తుచేస్తూ, ఇరుదేశాలు 'స్పెషల్ గ్లోబల్ స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్' దశకు చేరుకున్నాయని ఆయన అన్నారు.



**'భారత్ ఇన్నోవేట్స్' ప్రారంభం– స్టార్టప్‌లకు గ్లోబల్ వేదిక**

జూన్? 14న ఫ్రాన్స్‌లోని నీస్ నగరంలో ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మెక్రాన్?తో కలిసి 'భారత్ ఇన్నోవేట్స్' కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ప్రధాని తెలిపారు. భారత్–-ఫ్రాన్స్ ఇన్నోవేషన్ సంవత్సరానికి అనుగుణంగా ఈ కార్యక్రమం నిర్వహించబడుతోంది. ఈ వేదిక ద్వారా భారత్‌లోని అత్యుత్తమ స్టార్టప్‌లకు అంతర్జాతీయ పెట్టుబడిదారులతో నేరుగా అనుసంధానం కల్పించబడుతుంది. భారత ఉన్నత విద్యా వ్యవస్థ నుంచి వెలువడుతున్న ఆవిష్కరణలను ప్రపంచ మార్కెట్‌కు తీసుకెళ్లే ప్రధాన వేదికగా ఇది మారనుందని ఆయన అన్నారు.

**భారత్–ఈయూ వాణిజ్య ఒప్పందంపై వేగం**

భారత్–యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందంపై చర్చలు మరింత వేగం పుంజుకోనున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. స్లోవేకియా ఈయూలో కీలక సభ్యదేశంగా ఉండటంతో ఈ పర్యటన వ్యూహాత్మకంగా మరింత ప్రాధాన్యం సంతరించుకుంటుందని తెలిపారు. భారత్–ఈయూ మధ్య ఉన్న వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ చర్చలు కొనసాగుతాయని ఆయన చెప్పారు. వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతికత వంటి రంగాల్లో సహకారం మరింత విస్తరించనున్నట్లు సంకేతాలు ఇచ్చారు.

**వివాటెక్ 2026లో భారత్ హవా**

ఫ్రాన్స్ పర్యటన చివరి దశలో పారిస్‌లో జరగనున్న వివాటెక్ 2026 కార్యక్రమంలో కూడా ప్రధాని పాల్గొననున్నారు. ఇది యూరప్‌లో అతిపెద్ద టెక్నాలజీ, ఇన్నోవేషన్ సమావేశంగా గుర్తింపు పొందింది. ఈసారి భారత్‌కు అతిపెద్ద జాతీయ పెవిలియన్ లభించడం దేశ స్టార్టప్ ఎకోసిస్టమ్‌కు అంతర్జాతీయ గుర్తింపు పెరుగుతోందని సూచిస్తుందని మోదీ తెలిపారు. భారత్--యూరప్ ఇన్నోవేషన్ భాగస్వామ్యానికి ఇది కొత్త దిశను ఇస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. అలాగే పారిస్‌లో నివసిస్తున్న భారతీయ కమ్యూనిటీ సభ్యులతో సమావేశం కావాలని తాను ఎదురుచూస్తున్నట్లు ప్రధాని చెప్పారు. వారు రెండు దేశాల మధ్య సాంస్కృతిక, సామాజిక వారధిగా పనిచేస్తున్నారని ఆయన ప్రశంసించారు.

**స్లోవేకియాలో చారిత్రక తొలి పర్యటన**

ఫ్రాన్స్ అనంతరం ప్రధాని మోదీ జూన్ 14–15 తేదీల్లో స్లోవేకియా రిపబ్లిక్‌కు రాష్ట్ర పర్యటన చేయనున్నారు. 1993లో ఆ దేశానికి స్వతంత్రం వచ్చిన తర్వాత అక్కడ పర్యటించే తొలి భారత ప్రధాని కావడం ఈ పర్యటన ప్రత్యేకత. అక్కడ అధ్యక్షుడు పీటర్ పెల్లెగ్రిని, అలాగే ప్రధాని రాబర్ట్ ఫికోతో మోదీ చర్చలు జరపనున్నారు. స్లోవేకియా వ్యాపార నాయకులతో కూడా సమావేశం కానున్నారు.

**జీ7 సదస్సులో భారత్ స్వరం**

స్లోవేకియా పర్యటన అనంతరం ప్రధాని మోదీ ఫ్రాన్స్‌లోని ఇవియాన్‌లో జూన్ 16, 17 తేదీల్లో జరగనున్న జీ7 శిఖరాగ్ర సదస్సులో పాల్గొననున్నారు. భారత్‌కు వరుసగా ఎనిమిదోసారి ఆహ్వానం లభించడం దేశానికి లభిస్తున్న అంతర్జాతీయ విశ్వాసానికి నిదర్శనమని ప్రధాని మోదీ తెలిపారు. భారత్ పెరుగుతున్న గ్లోబల్ ప్రొఫైల్, ఆర్థిక శక్తి, డిప్లొమాటిక్ ప్రభావం ఈ ఆహ్వానాల ద్వారా స్పష్టమవుతోందని ఆయన అన్నారు. జీ7 సదస్సులో భారత్ తన స్వరం మాత్రమే కాదు, గ్లోబల్ సౌత్ ఆశయాలకు కూడా ప్రతినిధిగా నిలుస్తుందని అని మోదీ పేర్కొన్నారు. ప్రపంచ దక్షిణ భాగంలోని దేశాలు ఎదుర్కొంటున్న అభివృద్ధి సవాళ్లను అంతర్జాతీయ సమాజం దృష్టికి తీసుకెళ్లడం భారత్ బాధ్యతగా భావిస్తోందని ఆయన తెలిపారు.

# హస్తంలో కల్లోలం

-మొదటిపేజీ తరువాయి

ఆ ఆడియోలోని మాటలు ఉన్నప్పటికీ పార్టీలో చర్చనీయాంశమయ్యింది. ఆ ఆడియోలో ఉన్న మాటల ప్రకారం.. తనకు కాకుండా ఎవరో చంద్రశేఖర్‌రెడ్డి అనే వ్యక్తికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పదవి ఇవ్వడాన్ని తప్పుపడుతూ తాను ఉరి పెట్టుకుంటానంటూ ఓ నాయకుడు షబ్బీర్ అలీకి ఫోన్ చేయగా, సదరు నాయకుడిని ఓదారుస్తూ షబ్బీర్ అలీ కొన్ని వ్యాఖ్యలు చేశారు. డబ్బులు పెడుతున్నారని, మహిళలను ఎరగా వేసి పదవులు తీసుకుంటున్నారనే కోణంలో వ్యాఖ్యలు ఉండటంతో పాటు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ పేరు కూడా ఉచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ అమ్ముడుపోయే పార్టీగా మారిపోయిందంటూ వ్యాఖ్యానించారు. అయితే ఈ ఆడియో ఎప్పటిదో అయినా..అది కాస్తా ఇప్పుడు బయటకు వచ్చి వైరల్ అయ్యింది.

**నేనేంటో అందరికీ తెలుసు: మహేశ్‌గౌడ్**

ఈ ఆడియో వ్యవహారంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ స్పందించారు. శనివారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న సందర్భంలో దీనిపై ప్రశ్నించగా.. ఎలాంటి ఆరోపణల విషయంలోనైనా తొందరపడేది లేదని స్పష్టం చేశారు. 'నా వ్యక్తిత్వం, ఆస్తిపాస్తులు, నా పుట్టుక ఏంటో రాష్ట్ర ప్రజలకు తెలుసు. నిజామాబాద్ ప్రజలకు ఇంకా బాగా తెలుసు. 40 ఏళ్లుగా లేని అవినీతి ఇప్పుడెక్కడ నుంచి వస్తుంది? షబ్బీర్ అలీనే ఆ వ్యక్తిని రేవంత్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరి?పంచారు. ఎందుకు చేరి?పంచారో ఆయనే సమాధానం చెప్పాలి. రేవంత్‌రెడ్డి సిఫారసు చేసినందుకే చంద్రశేఖర్‌రెడ్డికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పదవి వచ్చింది. షబ్బీర్ అలీ అయినా, ఎవరైనా మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా మాట్లాడాలి. మహిళల పరువు తీసేలా వ్యాఖ్యానాలు చేయకూడదు. దీనిపై ఆయన్ను వివరణ కోరాం. ఈ వ్యవహారం పార్టీ చూసుకుంటుంది..' అని చెప్పారు.

**పీసీపీ చీఫ్‌ను టార్గెట్ చేశారా?**

పీసీసీ అధ్యక్షుడిగా రెండేళ్ల పదవీ కాలం ముగియకముందే



మహేశ్‌కుమార్‌గౌడ్‌ను పార్టీలోని కొందరు టార్గెట్ చేశారా? అనే చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది. ఈ చర్చకు ఇటీవలి కొన్ని పరిణామాలు కూడా ఊతమిస్తున్నాయి. పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌గౌడ్ ఫెయిల్ అయ్యారంటూ ఇటీవలే ఓ చానెల్‌లో పెద్ద ఎత్తున వార్తలు రాగా, సీఎం రేవంత్‌కు సన్నిహితంగా ఉండే ఓ నాయకుడే ఇలా చేశారనే ప్రచారం కూడా జరిగింది. ఈ వ్యవహారం పూర్తిగా సమసిపోక ముందే ఎప్పుడో మాట్లాడిన ఆడియోను ఇప్పుడు బయటకు తీసుకురావడం చర్చనీయాంశమవుతోంది. అది కూడా సీఎం రేవంత్‌కు సన్నిహితుడైన నాయకుడే మాట్లాడినట్టు అందులో ఉండడం విశేషం. ఈ నేపథ్యంలో పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌గౌడ్ బలహీనపడ్డారా? లేదంటే పద్మవ్యూహంలో చిక్కుకుంటున్నారా..అన్నది అర్థం కావడం లేదని గాంధీభవన్ వర్గాలంటున్నాయి.

**వ్యాఖ్యలపై వివరణ ఇవ్వండి**

పీసీసీ అధ్యక్షుడి ప్రతిష్టకు భంగం కలిగేలా, పార్టీలో పనిచేస్తున్న మహిళలను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ పేర్కొంది. మీడియాలో వచ్చిన కథనాలు, పార్టీ కార్యకర్తతో మాట్లాడిన సంభాషణపై వివరణ ఇవ్వాలని క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లురవి, వైస్‌చైర్మన్ అనంతుల శ్యాంమోహన్, సభ్యుడు జాఫర్ జావేద్‌లు శనివారం షబ్బీర్ అలీకి లేఖ రాశారు. వివరణపై ఎలాంటి ఆలస్యం చేయకూడదని సూచించారు.

# ఖమ్మంలో గాయత్రీ రవి టార్గెట్

**ఖమ్మం :** ఖమ్మం జిల్లాలో విజిలెన్స్ దాడులు కలకలం రేపుతున్నాయి. మరీ ముఖ్యంగా బీఆర్ఎస్‌కు చెందిన రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అలియాస్ గాయత్రి రవికి చెందిన కంపెనీల మీదే వరుసబెట్టి జరుగుతుండటం పొలిటికల్ హాట్ అవుతోంది. ఇదంతా నిజంగానే అక్రమాల వెలికితీత కోసం జరుగుతోందా?? లేక రాజకీయ కక్ష సాధింపులో భాగమా అన్న అనుమానాలు అన్ని వర్గాల్లో పెరుగుతున్నాయట. వరంగల్ జిల్లాకు చెందిన వద్దిరాజు ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో గ్రానైట్ వ్యాపారం ఉంది. బీసీ కాపు సామాజిక వర్గానికి చెందిన రవిమొదట్లో కాంగ్రెస్ అభిమానిగానే ఉన్నారు. 2018లో ఆ పార్టీ వరంగల్ తూర్పు అసెంబ్లీ టిక్కెట్ ఇచ్చిందిగానీ విజయం సాధించలేదు. ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరాక రాజ్యసభ సభ్యుడిగా అవకాశం కల్పించారు కేసీఆర్. ఆ పదవీకాలం రెండేళ్ళే కావడం, ముగిసిపోవడంతో తిరిగి ఆయనకే రెన్యువల్ చేశారు. ఈ పరిస్థితుల్లో 2024 లోక్‌సభ ఎన్నికల్లో వద్దిరాజును తమ పార్టీ తరపున ఖమ్మం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయించాలని అనుకున్నారట కాంగ్రెస్‌లోని కొందరు. అందుకు ఆయన ఒప్పుకోకపోగా బీఆర్ఎస్‌కు అండగా ఉంటున్నారన్న కోపంతో అధికార పార్టీ ఇప్పుడు టార్గెట్ చేసిందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి పొలిటికల్ సర్కిల్స్‌లో. కేసీఆర్, హరీష్‌రావు లాంటి అగ్ర నాయకులకు దగ్గరగా ఉండే గాయత్రి రవిని బీఆర్ఎస్‌కు దూరం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఆ క్రమంలోనే కొద్ది రోజులుగా ఆయనకు చెందిన గ్రానైట్ కంపెనీల్లో విజిలెన్స్ దాడులు జరుగుతున్నాయన్న ప్రచారం నడుస్తోంది. ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లోని గ్రానైట్ క్వారీల్లో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. అయితే ఇవి ఎక్కడా బయటికి ఎక్స్‌పోజ్ అవకుండా జాగ్రత్త పడ్డారట అధికారులు. మరోవైపు కొంతకాలంగా? ఖమ్మం జిల్లా కారును గాయత్రి రవి, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యేలు కందాల, సండ్ర వెంకటవీరయ్య కలిసి నడిపిస్తున్నారు. ఇందులో కీలకంగా ఉన్నందునే గాయత్రి రవి టార్గెట్ అయ్యారా అన్న అనుమానాలు కూడా చాలామందికి



ఉన్నాయట. జిల్లాలో ఉన్న ముఖ్యమైన ప్రతిపక్ష నాయకులు ఒక్కొక్కరిని టార్గెట్ చేసేలా అధికార పార్టీ పావులు కదుపుతోందన్నది బీఆర్ఎస్ అభిప్రాయం. అటు గతంలో కాంగ్రెస్ నేతలకు అత్యంత ఆప్తుడిగా ఉండేవారు రవి. ప్రస్తుతం రాష్ట్రంలో కీలక మంత్రిత్వ శాఖను నిర్వహిస్తున్న ఒక మినిస్టర్‌కు అప్పట్లో రైట్ హ్యాండ్‌లా ఉండేవారాయన. ఇప్పుడు తనకు ఎదురవుతున్న సమస్యలు, వేధింపుల గురించి వద్దిరాజు రవిచంద్ర సదరు మంత్రికి చెప్పుకున్నా నా చేతిలో ఏమీ లేదని ఆయన అన్నట్టు తెలిసింది. మరోవైపు వచ్చే అసెంబ్లీ? ఎన్నికల్లో కొత్తగూడెం నుంచి ఎమ్మెల్యే సీట్లో రవి పోటీ చేస్తారన్న ప్రచారం సైతం ఉంది. ఇక ఆయన గ్రానైట్ క్వారీలతో పాటు మాజీ మంత్రి పువ్వాడ అజయ్ బంధువులు నిర్వహిస్తున్న దుకాణ సముదాయానికి కూడా అధికారులు నోటీసులు ఇచ్చారట. వాటి వెనుక సైతం అధికార పార్టీ నేతల వత్తిడి ఉందని ఆఫ్ ద రికార్డ్‌లో అజయ్ అంటున్నారట. అయితే దాన్ని ఇష్యూ చేయడం వల్ల వచ్చే ప్రయోజనం కూడా ఏమీ ఉండదన్నది ఆయన అభిప్రాయం. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో జిల్లా పాలిటిక్స్‌లో అజయ్ వర్సెస్ గాయత్రి రవి అన్నట్టుగా కూడా వ్యవహారాలు నడిచాయి. ఆ సంగతి ఎలా ఉన్నా ప్రస్తుతం నడుస్తున్న విజిలెన్స్ వ్యవహారాలను గాయత్రి రవి ఎలా ఎదుర్కొంటారోనని చూస్తున్నాయి రాజకీయవర్గాలు.

# బోధన్ లో కనిపించని షకీల్

**నిజామాబాద్ :** ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో.. గులాబీ పార్టీ సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశాలు జోరుగా జరుగుతున్నాయి. మీటింగ్స్‌కు హాజరవుతున్న పార్టీ నేతలంతా ఐక్యతా రాగం ఆలపిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు జట్టుగా, కలిసి కట్టుగా సమావేశాల్లో పాల్గొన్ని క్యాడర్‌లో జోష్ నింపుతున్నారు. ఇక్కడ మొత్తం 9 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా.. ఒక్క బోధన్ మినహా అన్ని చోట్ల సమావేశాల నిర్వహణ పూర్తయింది. చివరికి నియోజకవర్గ ఇన్చార్జ్ లేని బాన్సువాడలోనూ మూడు మండలాలకు ఓ సమావేశం చొప్పున పూర్తి చేశారు. కానీ? మాజీ ఎమ్మెల్యే షకీల్ బాధ్యుడిగా ఉన్న బోధన్‌లో మాత్రం పట్టించుకునే నాధుడే లేడు. అక్కడ అసలు సన్నాహక సమావేశం జరుగుతుందో లేదో కూడా తెలియని గందరగోళ పరిస్థితులు ఉన్నాయట. ఈనెల 1న మీటింగ్ ఉంటుందని ప్రకటించి.. వాయిదా వేశారు. తిరిగి ఎప్పుడు ఉంటుందో తెలియదు. సభ్యత్వ నమోదును ప్రతిష్టాత్మకంగా తీలుకున్న బీఆర్ఎస్ఎక్కడికక్కడ ఇన్చార్జ్‌లను నియమించి రిపోర్టులు తెప్పించుకుంటోంది. బోధన్‌లో మాత్రం సమావేశం జరగకపోవడం, ఇన్చార్జ్ షకీల్ అందుబాటులో ఉండటం లేదన్న ఫిర్యాదులపై గులాబీ బాస్ ఆగ్రహంగా ఉన్నట్టు తెలిసింది. పార్టీ తరపున నిరసన కార్యక్రమాలు చేయాలని ఆదేశాలు వచ్చినా.. ఇక్కడ ఇప్పటి వరకు ఒక్కటంటే ఒక్క కార్యక్రమం కూడా జరగలేదు. ఈ పరిణామాలు నాయకత్వానికి ఇబ్బందిగా మారడంతో పాటు? పార్టీ క్యాడర్ సైతం నిరుత్సాహంగా ఉన్నట్టు తెలుస్తోంది.గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత జరిగిన పరిణామాలతో దుబాయ్ వెళ్లిపోయారు షకీల్. అక్కడి వ్యాపారాల్లో బిజీ అయ్యారట. అప్పట్లో ఆయన బోధన్ వైపు కన్నెత్తి చూడకపోవడంతో మాజీ ఎమ్మెల్యే భార్యే అడపాదడపా పార్టీ వ్యవహారాలను చక్కబెట్టారు. తర్వాత కొన్నాళ్ళకు తిరిగి వచ్చిన షకీల్ ఇక యాక్టివ్ పాలిటిక్స్ చేస్తానని ప్రకటించారు. మళ్లీ ఏం జరిగిందో ఏమో.. తెలియదుగానీ? ఇంకోసారి దుబాయ్



ఫ్లైట్ ఎక్కేశారు. అక్కడి బిజినెస్ వ్యవహారాల్లో బిజీ అయిపోయి ఇక్కడ పార్టీని గాలికొదిలేశారన్నది కేడర్ టాక్. తాజాగా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో అందరూ పాల్గొంటున్నా.. ఆయన మాత్రం డుమ్మా కొడుతున్నారు. దీంతో? తమ నియోజకవర్గంలో అసలేం జరుగుతోందో అర్థంకాక కారు కేడర్ గందరగోళపడుతోంది. మాజీ ఎమ్మెల్యే కనిపించడం లేదంటూ సొంత పార్టీ కార్యకర్తలే సెటైర్లు వేస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చునని అంటోంది ద్వితీయ శ్రేణి. బోధన్ సభ్యత్వ నమోదు ఇన్చార్జ్‌గా ఉన్న మాజీ జడ్పీ ఛైర్మన్ విఠల్ రావు సైతం ఈ అంశంపై కేసీఆర్‌కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారట. దుబాయ్‌తో పాటు జిల్లాలోనూ రైస్ మిల్లు బిజినెస్‌లో బిజీగా మారిన షకీల్ మెల్లిగా రాజకీయాలకు దూరం అవుతున్నారా అన్నది కొందరి అనుమానం. ఆయన పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండటం వెనుక ఆసక్తి లేకపోవడమేనా..? లేక ఇతర బలమైన కారణాలు ఉన్నాయా అన్న ప్రశ్నలు సైతం వస్తున్నాయి. ఇలాంటి చాలా ప్రశ్నలకు సమాధానం దొరకాలంటే కొన్నాళ్లు ఆగాల్సిందేనన్నది రాజకీయ వర్గాల మాట. కానీ అప్పటి వరకు క్యాడర్ తలోదిక్కు వెళ్లకుండా చూడాల్సిన బాధ్యత పార్టీ పెద్దలదే. బాస్. జర దేఖో హమారా బోధన్ కోఅంటున్న కార్యకర్తల మాటల్ని పార్టీ పెద్దలు ఎంతవరకు పట్టించుకుంటారో చూడాలి.

## హెల్త్ కేర్ ఇన్నోవేషన్స్ కేంద్రంగా హైదరాబాద్

-మొదటిపేజీ తరువాయి

ఆయన శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ఏఐ ఏదో ఒక రంగానికి మాత్రమే పరిమితం కాలేదని, అన్నింటికి విస్తరించి మానవ జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. ముఖ్యంగా కేవలం వ్యాధి నిర్ధారణ దశకే పరిమితం కాకుండా... రాబోయే ముప్పును ముందే అంచనా వేసే స్థాయికి వైద్య రంగాన్ని చేర్చిందన్నారు. అలాగే... ప్రతి రోగికి ప్రత్యేక వ్యక్తిగత వైద్య సంరక్షణను అందించే సాధనంగా మారిందన్నారు. ఏఐ ఎప్పటికీ వైద్యుడికి ప్రత్యామ్నాయం కాలేదని స్పష్టం చేశారు. సాంకేతికతకు మానవీయ విలువల్ని జోడించినప్పుడే సమాజానికి మేలు జరుగుతుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా వృద్ధుల జనాభా పెరుగుతున్న తరుణంలో... క్యాన్సర్, గుండెజబ్బులు వంటి క్లిష్టమైన ఆరోగ్య సవాళ్లకు సరికొత్త పరిష్కారాలు, ఆవిష్కరణలు రావాల్సిన అవసరముందన్నారు. అందుకు... హైదరాబాద్ ను ఒక ల్యాంచ్ ప్యాడ్ తీర్చిదిద్దేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. అకాడెమియా, ఇండస్ట్రీ మధ్య బలమైన అనుసంధానం ఏర్పడినప్పుడే ఏఐ హెల్త్ కేర్ ఆవిష్కరణలు సామాన్యుడికి అందుతాయన్నారు. భవిష్యత్తు సవాళ్లను ముందే ఎదుర్కొనేలా... కొత్త ఆలోచనల్ని ప్రోత్సహించే ఇన్నోవేషన్ ఆధారిత వ్యూహాలతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు.
ఆవిష్కరణలు కేవలం ల్యాబ్‌లకే పరిమితం కాకుండా, సమాజంలో నిజమైన మార్పును తీసుకొచ్చేలా ఆవిష్కర్తలు, స్టార్టప్స్ కు మార్గనిర్దేశం చేస్తున్నామన్నారు. పరిశోధనలకు ఊతమిచ్చేలా దేశంలోనే తొలిసారిగా ఏఐ ఆధారిత డేటా ఎక్స్ ఛేంజ్ ను ప్రారంభించామన్నారు. లైఫ్ సైన్సెస్ లో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు 'వన్ బయో' పేరిట ప్రత్యేక వ్యవస్థను అందుబాటులోకి తెచ్చామన్నారు. స్టార్టప్స్ కు అండగా నిలిచేందుకు 'ఫండ్స్ ఆఫ్ ఫండ్స్'ను ఏర్పాటు చేశామని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. హైదరాబాద్ వేదికగా గ్లోబల్ హెల్త్ టెక్ విప్లవంలో భాగస్వామ్యం కావాలని నిపుణులు, ఆవిష్కర్తలు, కంపెనీలు, స్టార్టప్స్ ను సాదరంగా ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు.

## గగనతల రక్షణ వ్యవస్థకు ఎయిర్‌ఫోర్స్ కీలకం.

-మొదటిపేజీ తరువాయి

అవార్డులను ప్రదానం చేసిన మంత్రి

అంతకుముందు ఎయిర్ ఫోర్స్, నేవీ, కోస్ట్ గార్డ్ ట్రైనీలకు వింగ్స్, బ్రెవెట్స్‌ను రాజ్‌నాథ్‌సింగ్ అందజేశారు. పరేడ్‌లో సుఖోయ్, సూర్యకిరణ్, సారంగ్ విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తొలి ఎన్‌డీఏ మహిళా క్యాడెట్ల కమిషనింగ్‌కు ఎయిర్‌ఫోర్స్ అకాడమీ వేదిక అయ్యింది. మెరిట్?లో అగ్రస్థానంలో నిలిచిన క్యాడెట్లకు ప్రెసిడెంట్స్ ప్లాక్ అవార్డులను రక్షణమంత్రి ప్రదానం చేశారు. ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో ఎయిర్‌చీఫ్ మార్షల్ ఎ.పి.సింగ్ నేతృత్వంలో ఫ్లైపాస్ట్, ఎయిర్‌ఫోర్స్, నేవీ, కోస్ట్ గార్డ్ ట్రైనీలకు వింగ్స్, బ్రెవెట్స్ అందజేశారు. వియత్నాం ట్రైనీలకూ శిక్షణ పూర్తి ధ్రువపత్రాల ప్రదానం చేశారు. పరేడ్ ప్రారంభంలో ఆకాష్‌గంగా, ఎయిర్ వారియర్ డ్రిల్ టీమ్ విన్యాసాలు ప్రదర్శించారు.
"గగనతల రక్షణ వ్యవస్థకు ఎయిర్‌ఫోర్స్ చాలా కీలకం. ఆపరేషన్ సింధూర్‌లో ఎయిర్ వారియర్స్ కీలక పాత్ర పోషించారు. దేశ రక్షణ కోసం ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి. యుద్ధంలో సాంకేతిక వినియోగం చాలా పెరిగింది. సాంకేతిక వినియోగాన్ని అధికారులు అందిపుచ్చుకోవాలి. ఈ టెక్నాలజీ ప్రపంచంలో అనునిత్యం అప్రమత్తంగా ఉండాలి"

**దేశ భద్రతలో సీఐఎస్ఎఫ్ పాత్ర అత్యంత కీలకం**

హైదరాబాద్‌లోని సీఐఎస్ఎఫ్ నేషనల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ అకాడమీలో నిర్వహించిన పాసింగ్ అవుట్ పరేడ్ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా ముఖ్య అతిథిగా హాజరై పరేడ్?లో గౌరవ వందనం స్వీకరించారు. 39వ బ్యాచ్‌కు చెందిన 76 మంది అసిస్టెంట్ కమాండెంట్లు, 9వ బ్యాచ్‌కు చెందిన 124 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లు, 5 మంది మహిళా అధికారుల పాసింగ్ అవుట్ పరేడ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, దేశ భద్రతలో సీఐఎస్ఎఫ్ పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. క్రమశిక్షణ, నిబద్ధత, సేవా భావంతో విధులు నిర్వహిస్తూ దేశ ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని శిక్షణార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ ఉన్నతాధికారులు, కుటుంబ సభ్యులు, ఆహ్వానితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నైరుతి రుతుపవనాల రాకతో తెలంగాణలో వర్షాలు



రాష్ట్రంలో హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. పెద్ద ఎత్తున ఈదరు గాలులు వీయడంతో జరిగిన ప్రమాదాల్లో కరెంట్ షాక్ తగిలి తండ్రి, కుమార్తె, చెట్టు విరిగి పడి ఓ మహిళ మృతిచెందారు. శంషాబాద్ విమానాశ్రయంలో విమాన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మెదక్ జిల్లాల్లోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసి ఉంచిన వడ్ల బస్తాలు తడిసి ముద్దయ్యాయి. నైరుతి రుతుపవనాల రాకతో హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో భారీ వర్షం కురిసింది. జోరు వాన ఈదురు గాలులు కారణంగా శంషాబాద్ విమానాశ్రయంలో విమాన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రతికూల వాతావరణం వల్ల 9 విమానాలను అధికారులు దారిమళ్లించారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో అర్ధరాత్రి కురిసిన భారీ వర్షంతో దేవరంపల్లిలోని ఈసీ వాగు పొంగిపొర్లుతోంది. వికారాబాద్ రంగారెడ్డి జిల్లాల్లో జోరు వాన కారణంగా రైతులంతా పంట సాగుకు సిద్ధమయ్యారు. సకాలంలో వానలు పడటంతో అన్నదాతలు విత్తనాలను నాటడం ప్రారంభించారు. మెదక్ జిల్లాలో కురిసిన భారీ వర్షాల కారణంగా పలు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసి నిల్వ ఉంచిన బస్తాలు తడిసి ముద్దయ్యాయి. చిన్న శంకరంపేట్ మండలం కామారంలోని కొనుగోలు కేంద్రంలో 2 లారీల ధాన్యం వర్షానికి తడిసిపోగా కొల్చారం మండలం కొంగోడు కొనుగోలు కేంద్రంలో తూకం వేసిన 3 లారీల ధాన్యం వర్షానికి తడిసింది. వడ్ల దెబ్బతింటాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
"ధాన్యం తీసుకొచ్చి నెల రోజులు అవుతోంది. నిన్న కాంటా అయింది. రాత్రి చినుకులు పడ్డాయి. సంచులు తిరగెయ్యమంటున్నారు. ధాన్యం ఆరేసే వారు ఎవరూ లేరు. మా బస్తాలన్నీ వర్షానికి నానిపోయాయి. మా సంచులు 15 ఉన్నాయి. లారీలు రాకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొంది. ఇలా అనేక ఇబ్బందులు పడుతున్నాం" – రైతులు

**విద్యుత్ షాక్‌కు గురై మృతి**

భారీ వర్షాలు వల్ల జరిగిన దర్ఘటనల్లో పలువురు మృతిచెందారు. సికింద్రాబాద్‌లోని అల్వాల్‌లో భారీ వర్షం కారణంగా విద్యుత్ షాక్‌కు గురై తండ్రి, కూతురు మృతి చెందారు. టెలికాం కాలనీకి చెందిన సందీప్ సాయి ఇంటి ఎదురుగా ఉన్న భారీ చెట్టు, వర్షానికి విరిగి కారుపై పడింది. వర్షం తగ్గిన తర్వాత చెట్టు కొమ్మలను తొలగించేందుకు సందీప్, ఆయన భార్య శ్వేత, కుమార్తె రితిక కారువద్దకు వెళ్లారు. చెట్టు కొమ్మల మధ్య ఉన్న విద్యుత్ తీగలను వారు గమనించకపోవడంతో అవి తగిలి ఇరువురు అక్కడికక్కడే మృతి చెందారు. శ్వేతకు కూడా షాక్ తగిలినప్పటికీ స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

**ఇంటిపై చెట్టు కూలడంతో మహిళ మృతి**

రంగారెడ్డి జిల్లా మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ ఈదురు గాలుల కారణంగా తాటి చెట్టు ఇంటిపై పడి ఓ మహిళ ప్రాణాలు కోల్పోయింది. రాఘవేంద్ర నగర్ కాలనీకి చెందిన సభావత్ లక్ష్మి ఆమె కుమారుడు వెంకట్, కోడలు లలిత రేకుల ఇంట్లో నిద్రిస్తుండగా ఈదురుగాలులకు చెట్టు ఇంటిపై పడింది. ప్రమాదంలో వెంకట్, లలిత స్వల్ప గాయాలతో బయటపడగా తీవ్రంగా గాయపడిన లక్ష్మిని స్థానికులు వెంటనే ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె మృతి చెందారు.

**రాత్రంతా బిక్కుబిక్కుమంటూ**

గాలివాన బీభత్సానికి వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం లక్ష్మీపురంలో ఐదు ఇంళ్ల రేకులు ఎగిరిపోయాయి. అర్ధరాత్రి జరిగిన ఘటనతో ఆయా కుటుంబాల వారు తీవ్రంగా నష్టపోయారు. ఇంట్లో వస్తువులన్నీ తడిసి ముద్దవడమే కాక విలువైన వస్తువులు ఉపయోగించేందుకు వీలు లేకుండా మారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. సురేష్ కు సంబంధించిన ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపోయి పోలాల్లో పడ్డాయి. కొత్తగా నిర్మించిన పశువుల కొట్టం ఆనవాళ్లు కోల్పొయింది. ప్రకృతి విపత్తుతో ఇంటిల్లిపాది రాత్రంతా బిక్కుబిక్కుమంటూ భయంతో వణికిపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు వేడుకుంటున్నారు.

నవగీతం తెలుగు దినపత్రిక

# దిగొస్తున్న బంగారం ధరలు

బంగారం ధరలు పతనమన్న వార్త మధ్యతరగతి ఇళ్లల్లో కనిపిస్తోంది. ముఖ్యంగా మహిళల మోహాల్లో వెయ్యి వాట్ల బల్బు వెలిగినంత హ్యాపీనెస్ జిగేల్‌మంటోంది. మగవారికి జీతం పెరిగినప్పుడు వచ్చే సంతోషం ఒకెత్తయితే..మహిళలకు బంగారం ధర తగ్గినప్పుడు వచ్చే ఆనందం ఇంకో ఎత్తు. ఎందుకంటే, మధ్యతరగతి మహిళల దృష్టిలో బంగారం అనేది కేవలం ఒక నగ కాదు..అది వారి కష్టార్జితం, దాచుకున్న రహస్య పొదుపు, ఆపదలో ఆదుకునే ఒక నమ్మకం. నెలనెలా దాచుకున్న చిట్టీ డబ్బులు తీసి ఓ చిన్న ముక్కుపుడకో, ఉంగరమో కొనడం ఆడవాళ్లు ఆర్థికభద్రతగా భావిస్తారు. బంగారం ధర పది రోజుల్లో ఏకంగా 10 వేల 690 రూపాయలు తగ్గింది. గురువారం 24 క్యారెట్ల తులం బంగారం లక్షా 45 వేల 640కి దిగి వచ్చింది. ఒక్కరోజులోనే 2 వేలకు పైగా తగ్గింది. కొన్ని రోజులుగా బంగారం ధరలు తీవ్రంగా ఒడిదొడుకులకు లోనవుతున్నాయి. 2026 ప్రారంభంలో అంతర్జాతీయ మార్కెట్లో రికార్డ్ స్థాయిలో ఒక ఔన్స్ బంగారం ధర దాదాపు 5,500 నుంచి 5,600 డాలర్ల దగ్గర ఆల్‌టైమ్ హైని తాకింది. కానీ, గడిచిన కొన్ని వారాల్లోనే అది ఏకంగా 4,200 డాలర్ల స్థాయికి పడిపోయింది. అంటే దాదాపు 15 నుంచి 20 శాతం వరకు క్షీణత. ఇరాన్ యుద్ధం మళ్లీ ఉద్రిక్తతలను పెంచుతోంది. ద్రవ్యోల్బణం భయపెడుతోంది.. అయినా సరే, సేఫ్ హెవెన్ గా భావించే బంగారం ధరలు ఎందుకు తగ్గుతున్నాయి.. దీని వెనుక గ్లోబల్ ఎకనామిక్ గేమ్ ఏంటన్న విశ్లేషణ సాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధరలు 15శాతానికి పైగా తగ్గితే, ఇండియాలో కేవలం 4 నుంచి 5 శాతమే తగ్గాయి. దీనికి కారణం మన రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే బలహీనపడటం. అలాగే 2026 మేలో భారత ప్రభుత్వం కస్టమ్స్ డ్యూటీని 6శాతం నుంచి 15శాతానికి పెంచడం. ఈ డ్యూటీ పెంపుతో మన దేశీయ మార్కెట్లో పూర్తి స్థాయిలో తగ్గుదల ప్రభావం కనిపించలేదు.ప్రపంచవ్యాప్తంగా బంగారం ట్రేడింగ్ అంతా అమెరికన్ డాలర్లలోనే జరుగుతుంది. డాలర్‌కు, గోల్డ్‌కు ఎప్పుడూ వ్యతిరేక సంబంధమే. ప్రస్తుతం అమెరికా ఆర్థిక వ్యవస్థ ఊహించిన దానికంటే బలంగా ఉంది. డాలర్ బలంగా మారినప్పుడు, ఇతర కరెన్సీలు ఉపయోగించే దేశాలకు బంగారం కొనడం ఖరీదైన వ్యవహారం. దీనివల్ల అంతర్జాతీయంగా పుత్తడికి డిమాండ్ తగ్గి, ధరలు తగ్గుముఖం పడతాయి. 2026 ప్రారంభంలో, యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గిస్తుందని అందరూ భావించారు. వడ్డీ రేట్లు తగ్గితే బంగారం ధరలు పెరుగుతాయి. కానీ సీన్ రివర్స్ అయింది. అమెరికాలో ఇటీవల విడుదలైన ఉద్యోగాల గణాంకాలు చాలా బలంగా వచ్చాయి. దీనికి తోడు పశ్చిమాసియా సంక్షోభం కారణంగా ముడిచమురు ధరలు బ్యారెల్‌కు పైపైకి ఎగబాకాయి. చమురు పెరగడంతో ద్రవ్యోల్బణం మళ్లీ పెరుగుతుందనే భయాలు మొదలయ్యాయి. ఫలితంగా, యూఎస్ ఫెడ్ తన వడ్డీ రేట్ల కోతను సెప్టెంబర్ 2026 లేదా ఆ తర్వాతకు వాయిదా వేసింది. వడ్డీ రేట్లు ఎక్కువగా ఉన్నంత కాలం, పెట్టుబడిదారులు బంగారాన్ని వదిలి బాండ్లపై దృష్టి పెడతారు. ఎందుకంటే బంగారం ఎలాంటి వడ్డీని ఇవ్వదు, కానీ యూఎస్ బాండ్లు ప్రస్తుతం దాదాపు 1.74శాతం రియల్ ఈల్డ్‌ను అందిస్తున్నాయి. దీంతో గోల్డ్ డిమాండ్ తగ్గి?రేట్లు డౌనయ్యాయి. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ లేటెస్ట్ రిపోర్ట్ ప్రకారం, 2026 మొదటి క్వార్టర్‌లో సెంట్రల్ బ్యాంకుల కొనుగోళు దాదాపు 22శాతం తగ్గాయి. బంగారం ధరలు విపరీతమైన గరిష్ట స్థాయికి చేరడంతో, బ్యాంకులు కూడా కొత్త కొనుగోళ్లను కాస్త ఆపి, ప్రాఫిట్ బుకింగ్ వైపు మొగ్గు చూపాయి. అలాగే రష్యా సెంట్రల్ బ్యాంకు కూడా భారీగా భౌతిక బంగారం అమ్మేసుకుంటోంది. ఉక్రెయిన్ నాలుగేళ్లుగా యుద్ధం చేస్తున్న రష్యా?వార్‌ను కంటిన్యూ చెయ్యడానికి అవసరమైన వనరులను సమకూర్చుకోవడానికి గోల్డ్ వదిలించుకుంటోంది. ఈ నాలుగు నెలల్లో సుమారు 30 టన్నుల గోల్డ్‌ను సెల్ చేసింది.ఫిజికల్ గోల్డ్ కు డిమాండ్ తగ్గడం కూడా రేట్ల పడిపోవడానికి మరో కారణం. భారత్, చైనా వంటి దేశాల్లో ఆభరణాల డిమాండ్ గణనీయంగా పడిపోయింది. 2025, 2026 లలో ధరలు లక్షన్నర దాటడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు బంగారం కొనడం తగ్గించేశారు. పెళ్లిళ్ల సీజన్ ఉన్నప్పటికీ, లైట్ వెయిట్ జ్యువెలరీ లేదా పాత బంగారాన్ని మార్పిడి చేసుకోవడం పెరిగింది. మన దేశంలో బంగారం ధర పూర్తిగా అంతర్జాతీయ మార్కెట్ మీద మాత్రమే ఆధారపడి ఉండదు. కొన్ని లోకల్ ఫ్యాక్టర్స్ పనిచేస్తాయి. డాలర్–రూపాయి మార్పిడి రేటు అందులో ఒకటి. డాలర్ ఇండెక్స్ పెరగడం వల్ల రూపాయి విలువ దాదాపు 95 రూపాయల మార్కును దాటి వెళుతోంది. రూపాయి బలహీనపడితే మనం దిగుమతి చేసుకునే బంగారం ఖరీదవుతుంది. దిగుమతులు కూడా తగ్గుతాయి. డిజిటల్ గోల్డ్, ఇటీఎఫ్‌ల ట్రెండ్ బాగా పెరిగింది. భౌతిక బంగారం కంటే ఇప్పుడు యువత గోల్డ్ ఇటిఎఫ్‌లు, డిజిటల్ గోల్డ్ వైపు మొగ్గు చూపుతున్నారు. అయితే ధరలు భారీగా పెరగడంతో మార్చి, ఏప్రిల్ నెలల్లో ఈ ఈటిఎఫ్ ఇన్‌ఫ్లో కూడా తగ్గింది. డిమాండ్ సప్లై సూత్రం ప్రకారం?డిమాండ్ డౌనయ్యింది?రేటు దిగొచ్చింది. దేశంలో విదేశీ మారక నిల్వలను కాపాడటానికి ఒక్క ఏడాది పాటు అనవసరమైన బంగారం కొనడం ఆపాలని ప్రధాని నరేంద్ర మోడీ ప్రజలను కోరారు. పశ్చిమ ఆసియా యుద్ధంతో చమురు ధరలు పెరిగాయని?ఆయిల్ కొనడానికి డాలర్లు కావాలి కాబట్టి.. బంగారం దిగుమతులు తగ్గించాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోడీ ప్రకటన వచ్చిన మరుసటి రోజే కేంద్ర ప్రభుత్వం రంగంలోకి దిగింది. బంగారం, వెండి దిగుమతులపై కస్టమ్స్ డ్యూటీని 6శాతం నుంచి ఏకంగా 15శాతానికి పెంచుతూ సంచలన నిర్ణయం తీసుకుంది. సుంకం పెరగడం వల్ల విదేశాల నుంచి అధికారికంగా బంగారం దిగుమతి చేసుకోవడం ఖరీదైన వ్యవహారంగా మారింది. ఇది దేశీయంగా బంగారం కొత్త కొనుగోళ్లను చాలా వరకు నియంత్రించింది. మోడీ పిలుపునిచ్చిన 10 రోజుల్లోనే దేశంలోని కొన్ని ప్రాంతాల్లో జ్యువెలరీ షాపుల్లో సేల్స్ 80శాతం పడిపోయాయి. కస్టమర్ల ఆలోచనాధోరణి కూడా కొంత మారిందని కొందరు బులియన్ మార్కెట్ నిపుణుల అభిప్రాయం. 10 మందిలో ఆరుగురు ఈ ఏడాది బంగారం కొనకూడదని ఫిక్స్ అయ్యారు.వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ ప్రకారం.. భారతదేశంలో 2025లో డిజిటల్ గోల్డ్ కొనుగోళ్లు 69 శాతం పెరిగి 13.5 టన్నులకు చేరుకున్నాయి. ఇదే సమయంలో యూపీఐ ద్వారా డిజిటల్ గోల్డ్ కొనుగోళ్ల విలువ భారీగా పెరిగింది. 2025 జనవరిలో సుమారు ఎనిమిది వందల కోట్లుగా ఉన్న లావాదేవీలు? డిసెంబరు నాటికి 21 వందల కోట్లకుపైగా చేరినట్లు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. 2024 ఏప్రిల్‌తో పోలిస్తే 2025 ఆగస్టు నాటికి డిజిటల్ గోల్డ్ లావాదేవీల సంఖ్య 377 శాతం పెరగడం? ఈ రంగం విస్తరిస్తున్న వేగాన్ని సూచిస్తోంది. ముఖ్యంగా 20 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు కలిగినవారు ఈ పెట్టుబడి విధానాన్ని ఎక్కువగా ఎంచుకుంటున్నట్లు చెబుతున్నారు మార్కెట్ నిపుణులు. స్టాక్స్, మ్యూచువల్ ఫండ్స్ మాదిరిగానే మొబైల్ ఫోన్‌లో కొన్ని క్లిక్‌లతో బంగారం కొనుగోలు చేయగలగడంతో? పెట్టుబడులు ఈజీ అవుతున్నాయి. చిన్న మొత్తాలతో పెట్టుబడి ప్రారంభించే అవకాశం కూడా యువతను డిజిటల్ గోల్డ్ వైపు ఆకర్షిస్తోంది. సాధారణంగా భౌతిక బంగారం కొనుగోలు చేయాలంటే వేల రూపాయలు అవసరమవుతాయి. డిజిటల్ గోల్డ్‌లో ఒకటి నుంచి వంద రూపాయల చిన్న మొత్తాల నుంచే పెట్టుబడి ప్రారంభించవచ్చు. దీంతో విద్యార్థులు, యువ ఉద్యోగులు, చిన్న పెట్టుబడిదారులు కూడా డిజిటల్ బంగారంలో పెట్టుబడి పెట్టగలుగుతున్నారు. అదనంగా? నెలవారీ ఆటోమేటిక్ సేవింగ్స్ విధానాల ద్వారా క్రమం తప్పకుండా బంగారం కొనుగోలు చేసే అవకాశం కూడా ఉంది. టన్నుల కొద్దీ బంగారం కొనే మన దేశంలో.. గ్రాములు కొనడానికి కూడా సామాన్యుడు వెనుకాడుతున్నాడు. షాపులు కస్టమర్లు లేక ఖాళీగా దర్శనమిస్తున్నాయి. వ్యాపారులు డిస్కౌంట్లు ఇస్తామన్నా జనం అడుగు ముందుకు వేయడం లేదు. శతాబ్దాలుగా వస్తున్న గోల్డ్ సెంటిమెంట్‌ను దాటి ప్రజలు ఆలోచిస్తున్నారు. బంగారం ధరలు తగ్గినా?కొనుగోళ్లు పెరగడకపోవడం ప్రజల ఆలోచనా ధోరణిలో మార్పునకు ఒక నిదర్శనం. గోల్డ్ కొనుగోళ్లు తగ్గడం అనేది కేవలం ఒక లోహం ముచ్చట కాదు. ఇది దేశంలోని మధ్యతరగతి ప్రజల కొనుగోలు శక్తి తగ్గుతోందనడానికి, వారి ఆర్థిక సందిగ్ధతకు ఒక ప్రత్యక్ష నిదర్శనం. అలాగే ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునకు జనం ఏస్థాయిలో జేజేలు కొడతారు అనడానికి?తగ్గిన గోల్డ్ డిమాండే ఉదాహరణ.

# ఆక్రమిత కశ్మీర్ కల్లోలం



ఎప్పుడూ జమ్మూ, కశ్మీర్ గురించి అంతర్జాతీయ వేదికలపై గంభీరోపన్యాసాలిస్తూ, మానవ హక్కుల చాంపియన్‌గా తనను తాను చిత్రించుకునే పాకిస్తాన్ గత కొన్ని రోజులుగా ఆక్రమిత కశ్మీర్‌లో నెత్తురుటేర్లు పారిస్తోంది. అధికారిక లెక్కల ప్రకారం సైన్యం కాల్పుల్లో 30 మంది మరణించారంటున్నా, వాస్తవ సంఖ్య అంతకుమించి ఉంటుందన్నది స్థానికులు చెప్పే మాట. మరో 200 మంది గాయపడ్డారు. వేలాదిమంది అరెస్టయ్యారు. ఈసారి సాగిన నిరసన ప్రదర్శన సాధారణమైంది కాదు. ముజఫరాబాద్ ప్రదర్శనలో అన్నివర్గాలకూ చెందిన లక్షన్నరమంది పాల్గొన్నారు. మతం పేరు చెప్పి, గతం పేరుచెప్పి ఎల్లకాలమూ జనాన్ని మభ్యపెట్టడం సాధ్యంకాదని పాక్ పాలకులకు ఈ నిరసనలు తెలియజెప్పాయి. తమ ప్రాంత నదుల్లో మంగళ డ్యామ్‌వంటి ప్రాజెక్టులు నిర్మించి,ఇక్కడ ఉత్పత్తయ్యే జలవిద్యుత్‌ను పంజాబ్ తదితర ప్రాంతాలకు తరలించుకుపోతూ, స్థానికులకు అరకొర సదుపాయాలు కల్పించటం విషయంలో రెండు దశాబ్దాల క్రితమే అసంతృప్తి పెల్లుబికింది. కానీ సంఘటితం కాకపోవటంవల్ల చల్లారిపోయాయి. 2023లో రావల్‌కోట్, ముజఫరాబాద్, మరికొన్ని ఇతర ప్రాంతాల్లో స్థానిక సమస్యలపై కమిటీలు ఏర్పడి ఉద్యమించాయి. ప్రజల మౌలికాహారమైన గోధుమ పిండి ధర పెంచడాన్నిప్రశ్నించాయి. వీటిని ప్రభుత్వం బేఖాతరు చేసిన ఫలితంగా ఆ కమిటీ లు జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ(జాక్)గా ఒక్కటయ్యాయి. ఆనకట్టల కారణంగా పలువురు నిర్వాసితులవుతున్నా, వలసపోతున్నా పట్టించు కునేవారు లేరు. పోనీ అని స్థానిక ప్రజలకైనా ఒరిగేదేమీ ఉండదు. మిలిటెన్సీ ఉందన్న పేరిట భారీ స్థాయిలో సైన్యాన్ని మోహరించటం ఒక్కటే వారికి కనబడేది. అందుకేశాంతియుత పద్ధతుల్లో పన్నుల నిరాకరణ ఉద్యమం నిర్వహించటం, విద్యుత్ బిల్లుల చెల్లింపు నిలిపివేయటం, సంపూర్ణ బంద్, లాంగ్‌మార్చ్ వంటివి ఈ మూడేళ్లలో ఎన్నో జరిగాయి. సైన్యం పడగనీడలో కాలక్షేపం చేసే ప్రభుత్వానికుండే అధికారాలు అంతంత మాత్రం. ఏ జవాబుదారీతనమూ లేని సైన్యానిదే పెత్తనం. అందుకే ఆక్రమిత కశ్మీర్‌కు ఎదుగూ బొదుగూ లేదు. ఆ ప్రాంత వనరుల్ని కొల్లగొట్టడానికి పాక్ పాలకులు ఒక సృజనాత్మక విధానం కనుక్కున్నారు. 53 మందితో దానికొక అసెంబ్లీ ఉంది. ఆక్రమిత కశ్మీర్‌కు ముఖ్యమంత్రి కాదు... ప్రధాని ఉంటాడు. కానీ అధికారాలన్నీ ఇస్లామాబాద్‌లో కొలువుదీరిన సైనికాధికారుల ఆధిపత్యంవుండే కశ్మీర్ కౌన్సిల్ చేతిలో ఉంటాయి. ఈసారి కేవలం
ఆర్థిక సమస్యలపై మాత్రమే కాదు... అసెంబ్లీ అమరికపై కూడా డిమాండ్లు బయల్దేరాయి. మొత్తం 53 స్థానాలుండగా, ‘శరణార్థుల’కు డజను కేటాయిస్తారు. మరో అయిదు మహిళలకూ... ఉలేమాలు, సాంకేతిక నిపుణులు, విదేశాల్లో స్థిరపడిన కశ్మీరీలకు ఒక్కొక్క స్థానం ఉంటాయి. ఈ ఖాతాలకింద పోయే 20 స్థానాలకూ ఎన్నికలు జరిగేదెక్కడో, నిర్వహించేదెవరో ఎవరికీ తెలియదు. వారు ఎన్నుకోవాల్సింది మాత్రం 33 మందిని. మళ్లీ ఇందులో అత్యధికులు పాక్ పాలకుల కనుసన్నల్లో నడిచేవారే ఉంటారు. చివరకు కీలుబొమ్మ ప్రభుత్వం ఏర్పడుతుంది. ఉద్యమకారులు అడిగేదల్లా ‘శరణార్థుల’ డజను స్థానాలూ రద్దు చేయాలన్నదే. కానీ అలా చేస్తే స్థానికుల పెత్తనం పెరుగుతుందని ప్రభుత్వం భయపడుతోంది. అందుకే జాక్ నాయకుల ఆచూకీ చెబితే 35,000 డాలర్లు బహుమతి ఇస్తామని ప్రకటించింది. వచ్చే నెల్లో ఆక్రమిత కశ్మీర్ అసెంబ్లీకి ఎన్నికలు జరగబోతున్నాయి. ఆ ప్రాంత వనరుల దోపిడీ తప్ప, వారి ఆకాంక్షల్ని నెరవేర్చడం సాధ్యపడదని ఉద్యమాలను అణిచేయటం ద్వారా పాక్ చెబుతోంది. పాలకులు వలసవాద మనస్తత్వంతో ఆప్రాంతాన్ని చెరబట్టారు తప్ప, స్థానికుల డిమాండ్లపై ఖాతరు లేదు. ఉద్యమకారులు38 కోర్కెలు ప్రభుత్వం ముందుంచారు. డజను సీట్ల కోటా రద్దుతోపాటు మంత్రులు, ఉన్నతాధికారులు, రాజకీయనాయకులకిస్తున్న ఖరీదైన కార్లు, ఉచిత విద్యుత్ తదితర రాయితీలు రద్దు చేసి, ఆ నిధులు జన సంక్షేమానికి వ్యయం చేయాలని కూడావారు కోరుతున్నారు. ఇలాగే మొండికేస్తూ పోతే ఆ ప్రాంత ప్రజల ఆగ్రహం మరింత పెరుగుతుందే తప్ప చల్లారదని పాకిస్తాన్ పాలకులు గ్రహించాలి.

# కాంగ్రెస్ దమనం కమలం మౌనం



జాతీయ స్థాయిలో పేరుకు అధికార, ప్రతిపక్షాలుగా ఉన్న కాంగ్రెస్, బీజేపీలు తెలంగాణ లో విలువలు వదిలేసి అనైతిక రాజకీయాలకు పాల్పడుతున్నా యి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేండ్లు గడిచినా ఎన్నికల హామీలు అమలు చేయకుంటే, బీజేపీ మాట్లాడదు, పాలకులు ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తుంటే కనబడదు. రోజుకో భూదందా వెలుగు చూస్తుంటే పట్టించుకోదు. ఆఖరికి పేదల ఇండ్లు కూల్చుతుంటే గళమెత్తదు. మరి ఏం చేస్తుందంటే... అధికార పార్టీతో రాసుకుపూసుకొని తిరుగుతూ, కుదిరిన చోట దందాల్లో చేతులు కలుపుతూ ‘నవ్విపోదురు గాక నాకేటి...’ అన్నట్టుగా వ్యవహరిస్తున్నది. తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో ఇప్పుడు ప్రజల్లో బలంగా వినిపిస్తున్న ప్రశ్న ఒక్కటే ప్రజల సమస్యల విషయంలో కాంగ్రెస్, బీజేపీ నిజంగానే వేర్వేరు పార్టీలేనా? లేక ప్రజల బాధల దగ్గరకు వచ్చేసరికి రెండూ ఒకే విధంగా వ్యవహరిస్తున్నాయా? ఎందుకంటే గత కొన్ని నెలలుగా రాష్ట్రంలో జరిగిన అనేక కీలక ఘటనలను ప్రజలు గమనిస్తే, అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేక చర్యల ఆరోపణలు వచ్చిన సందర్భాల్లో ప్రతిపక్షంగా ఉండాల్సిన బీజేపీ ఆశ్చర్యకరమైన మౌనం పాటించిందనే భావన బలపడుతున్నది. ప్రజలు రోడ్లపైకి వచ్చి నిరసనలు చేసినప్పుడు, తమ భూముల కోసం గిరిజనులు పోరాడినప్పుడు, ఎరువుల కోసం రైతులు లైన్లలో నిలబడినప్పుడు, హామీల అమలు కోరుతూ నిరుద్యోగ యువత ధర్నాలు చేసినప్పుడు, ఇండ్ల కూల్చివేతలు జరిగినప్పుడు పేదలు ఆర్తనాదాలు పెట్టినప్పుడు బీజేపీ ఎక్కడ ఉన్నదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రంలో ప్రజల గొంతుకగా నిలుస్తున్నది, సమస్యలపై నిరంతరం పోరాడుతున్నది, బీఆర్ఎస్ మాత్రమేననే అభిప్రాయం తెలంగాణలో రోజు రోజుకూ ప్రత్యక్ష సాక్ష్యాలతో నిరూపితమవుతున్నది. లగచర్ల ప్రాంతం లో గిరిజనుల భూములను ఫార్మా కంపెనీల పేరిట స్వాధీనం చేసుకునే ప్రయత్నాలపై పెద్ద ఎత్తున నిరసనలు జరిగాయి. తరతరాలుగా జీవనాధారంగా ఉన్న భూమిని కోల్పోతామనే భయంతో గిరిజన కుటుంబాలు ఆందోళనకు దిగాయి. ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడుతున్న వారిపై దమనకాండ జరిగింది. కానీ బీజేపీ నాయకత్వం నుంచి స్పందన కనిపించలేదు. గిరిజన గ్రామాలకు వెళ్లి బాధితులను పరామర్శించలేదు. గిరిజనుల తరఫున బలంగా మాట్లాడింది, పోరాడింది బీఆర్ఎస్ నాయకత్వమే.తెలంగాణ ప్రభుత్వ అప్పులు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధించిన 400 ఎకరాలను ప్రైవేటుకు కట్టబెట్టాలని పాలక పెద్దలు కుట్ర చేశారు. రాత్రికి రాత్రి 120 ఎకరాల అడవిని నరికివేశారు. ఈ భూములను విద్యాభివృద్ధికి, వర్సిటీ భవిష్యత్తు అవసరాల కోసం వినియోగించాలని విద్యార్థులు, ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి. ప్రభుత్వం మాత్రం రియల్ ఎస్టేట్ కోణంలో ఆలోచించింది. ఈ అంశంలో కూడా కాంగ్రెస్, బీజేపీ ములాఖత్ స్పష్టంగా కనిపించింది. కేంద్ర విద్యాసంస్థల భూముల పరిరక్షణ గురించి బీజేపీ స్పష్టమైన వైఖరి తీసుకోకపోవడమే ఇందుకు నిదర్శనం. రైతులకు యూరియా అందకపోవడం వల్ల రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతుభరోసా ఎగవేతలు పరిపాటిగా మారిపోయాయి. ప్రభుత్వం ప్రాజెక్టుల నుంచి నీళ్లు ఇవ్వకుండా పంటలు ఎండబెట్టింది. రైతులు ఎరువుల కోసం గంటల తరబడి లైన్లలో నిలబడాల్సిన దుస్థితి వచ్చింది. రైతులు పండించిన పంటను రాష్ట్ర ప్రభుత్వం కొనకపోవడంతో కల్లాల్లో, మార్కెట్లలో ఎక్కడ చూసినా ధాన్యం పేరుకుపోయింది. పంటకు ప్రభుత్వం కనీస మద్దతు ధర ఇవ్వలేదు. ఇందులో ఏ అంశంపైనా బీజేపీ పట్టించుకున్న పాపానపోలేదు. రైతుకు అండగా నిలిచింది బీఆర్ఎస్. ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో పేదలకు చెందిన దాదాపు వెయ్యి ఇండ్లను ప్రభుత్వం కూల్చివేసింది. చిన్న పిల్లలు రోడ్డున పడటం, మహిళలు కన్నీళ్లు పెట్టుకోవడం, పేద కుటుంబాలు ఒక్కరాత్రిలోనే నిరాశ్రయులవడం యావత్తు రాష్ట్ర ప్రజలను తీవ్రంగా కలిచివేసింది. ఇంత పెద్ద మానవీయ విషాదం జరిగినప్పటికీ బీజేపీ నేతలు బాధితులను పరామర్శించలేదు. కేరళకు చెందిన అప్పటి సీఎం పినరయి విజయన్ కూడా ఈ విషయంపై స్పందించారు. కానీ గల్లీ నాయకత్వం నుంచి ఢిల్లీ నాయకత్వం వరకు కనీసం స్పందించలేదు. మూసీ సుందరీకరణ పేరుతో పేదల నివాస ప్రాంతాలపై జరిగిన అరాచక చర్యలు కూడా ప్రజల్లో భయాందోళనలు సృష్టించాయి. ఈ అంశంలో బీజేపీ నాయకత్వం బాధిత కుటుంబాలకు అండగా నిలబడలేదు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయకుండా, కుదిరితే సమర్థిస్తూ వచ్చింది. రాష్ట్రంలో నిరుద్యోగ యువత ప్రభుత్వం పట్ల, ప్రభుత్వ పెద్దల పట్ల ఆగ్రహంతో ఉన్నారు. రెండు లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ అంటూ ఎన్నికల ముందు కాంగ్రెస్ నమ్మబలికింది. కానీ ఆ హామీల అమలుకోసం యువత ధర్నాలు చేస్తే అరెస్టులతో వేధించింది. ఇంత జరుగుతున్నా బీజేపీ ఎందుకు స్పందించలేదు? ఈ సమయంలో నిరుద్యోగుల తరఫున నిరంతరం మాట్లాడింది బీఆర్ఎస్. నిరుద్యోగులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అండగా నిలుస్తూ గళమెత్తారు. కుమ్మర గ్రామంలో జరిగిన విషాద ఘటనలో రెండు నెలల చిన్నారి ప్రాణం కోల్పోవడం రాష్ట్ర ప్రజలను తీవ్రంగా కదిలించింది. ఇలాంటి ఘటనల్లో రాజకీయాలకు అతీతంగా ప్రతీ ఒక్కరు మానవత్వంతో స్పందించాల్సిన అవసరం ఉన్నది. బాధితులకు న్యాయం జరగాలని బీఆర్ఎస్ పోరాడింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించడంలో బీజేపీ నాయకత్వం విఫలమైంది. ఓ బీజేపీ నాయకుడి కుమారుడు, ఓ బాలికపై అఘాయిత్యం చేశాడని పోక్సో కేసు నమోదు కాగా, ఆ వ్యవహారంపై బీజేపీ మాట్లాడలేదు. విచిత్రంగా కాంగ్రెస్ నేతలు, మంత్రులు మౌనవ్రతం పాటించారు. అంటే దీన్ని బట్టి అర్థమయ్యేది ఏందంటే, ఆ రెండు పార్టీలకు స్వప్రయోజనాలు, రాజకీయలబ్ధి మాత్రమే కానీ, సమాజంలో వివిధ వర్గాల కష్టాలు పట్టవు. లేకపోతే బాలికకు అన్యాయం జరిగిన ఘటనలోనూ రాజకీయ లెక్కలు వేసుకోవడం ఏంది? ప్రజల సమస్యల దగ్గరకు వచ్చేసరికి కాంగ్రెస్ పాలకుల దమనకాండపై బీజేపీ మౌనం వహిస్తున్నది. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడాలని నిరంతరం మాట్లాడేది, ప్రజల సమస్యలను రాజకీయ లాభనష్టాల కోణంలో కాకుండా ప్రజల కోణంలో చూసేది, ప్రజల తరఫున గళం వినిపించేది, ఉద్యమాలకు ముందుండేది బీఆర్ఎస్, గులాబీ దళం మాత్రమే. జై తెలంగాణ.

నవగీతం
తెలుగు దినపత్రిక
ఆదివారం
14 జూన్ 2026

## ధర్మపురి పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



**నవగీతం, జూన్ 13, జగిత్యాల/ధర్మపురి:** జిల్లాలో పోలీసింగ్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దే దిశగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ధర్మపురి పోలీస్ స్టేషన్‌తో పాటు ధర్మపురి సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డుల నిర్వహణ, పెండింగ్ కేసుల పురోగతి, సిబ్బంది పనితీరు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కేసుల దర్యాప్తులో నాణ్యతతో పాటు వేగం కూడా ఉండేలా చర్యలు తీసుకోవాలని , సర్కిల్ పరిదిలో నమోదవుతున్న గ్రేవ్ కేసులు, అండర్ ఇన్వెస్టిగేషన్ ఉన్న కేసులలో ఉన్న సిడి ఫైల్స్ ను, పెండింగ్ ట్రాయల్లో ఉన్న సిడి ఫైళ్లను,పరిశీలించారు. తరచుగా సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్ లను తనిఖీ చేయాలని, సిబ్బంది పనితీరును నిత్యం పర్యవేక్షిస్తూ ఉండాలనీ సి.ఐ కి సూచించారు. కమ్యూనిటీ పోలీసులలో భాగంగా పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ప్రజలకు సైబర్ నేరాలు వివిధ సామాజిక అంశాలపై ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించాలని అన్నారు. అదేవిధంగా సి సి కెమెరాలు యొక్క ప్రాముఖ్యత గురించి గ్రామాల్లో తెలియజేస్తూ ప్రతి గ్రామశీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్న విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే నేరాల నియంత్రణలో విజిబుల్ పోలీసింగ్, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని , మాదకద్రవ్యాల నిర్మూలన, రోడ్డు భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో సమన్వయంతో పనిచేయాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ప్రతి కానిస్టేబుల్ తమ పరిధిలోని గ్రామాలను క్రమం తప్పకుండా సందర్శించి,ప్రజలతో మమేకమై శాంతిభద్రతలకు సంబంధించిన సమస్యలను తెలుసుకోవాలని ఆదేశించారు. విధుల్లో ఉన్న సమయంలో తప్పనిసరిగా లాఠీ వెంట ఉంచుకోవాలని సూచించారు. ఈ తనిఖీలో ఎస్పీ వెంట డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, సీఐ రామ్ నరసింహారెడ్డి, ఎస్ఐలు మహేష్, రవీందర్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మానం




**నవగీతం,జూన్13, రాయికల్ ప్రతినిధి:** రాయికల్ పట్టణంలోని శివాజీ రైతు యువజన సంఘం ఆధ్వర్యంలో పదో తరగతి ఇంటర్ ఎంసెట్ పాలిటెక్నిక్ వంటి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పలువురు విద్యార్థులకు శాలువాతో ఘనంగా సన్మానించి నగదు పారితోషికం అందజేశారు. ఈ సందర్భంగా యువజన సంఘ సభ్యులు పలువురు మాట్లాడుతూ ఉన్నత చదువులు మరింతగా రాణించి పలువురికి స్ఫూర్తిగా నిలవాలని కోరారు ఈ కార్యక్రమంలో శివాజీ రైతు యువజన సంఘం అధ్యక్షుడు కుంభాల శ్రీనివాస్ రెడ్డి కోశాధికారి కడపటి రాజేందర్ జిల్లాల గంగారెడ్డి దమ్మ గంగారెడ్డి, రాజేందర్ రాజారెడ్డి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు

## తల్లాడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా గొడుగునూరి లక్ష్మీరెడ్డి ప్రమాణ స్వీకారం



**నవగీతం,జూన్13, ?తల్లాడ ప్రతినిధి:** తల్లాడ మండల నూతన కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడి ప్రమాణ స్వీకార మహోత్సవం వైభవంగా జరిగింది. వై.ఎం.ఆర్ గార్డెన్స్ వేదికగా నిర్వహించిన ఈ వేడుకలో తల్లాడ మండల నూతన కాంగ్రెస్ అధ్యక్షుడిగా గొడుగునూరి లక్ష్మీరెడ్డి అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు.?ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. సీనియర్ నాయకులు, కార్యకర్తలను కలుపుకొని సమన్వయంతో ముందుకు సాగుతానని స్పష్టం చేశారు.?ఈ కార్యక్రమానికి మండల పరిధిలోని ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు భారీ సంఖ్యలో తరలివచ్చిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు హాజరై, నూతన అధ్యక్షుడిని శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## పదోన్నతి పొందిన నాయబ్ తహసీల్దార్ కు సన్మానం



**నవగీతం, జూన్13,కొడిమ్యాల ప్రతినిధి:** కొడిమ్యాల తదితర మండలాల్లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా, వివిధ శాఖల్లో సీనియర్ అసిస్టెంట్‌గా సేవలందించిన చిట్యాల భూమయ్య నాయబ్ తహసీల్దార్‌గా పదోన్నతి పొందిన సందర్భంగా ఆర్టీఐ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు అక్కపెల్లి రవీందర్ శాలువా కప్పి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో చిట్యాల భూమయ్య ఎల్లప్పుడూ ముందుంటారని, టీజీఆర్ఎస్ఏ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కూడా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పూట్కూరి రాజశేఖర్ రెడ్డి, మొగిలి వినోద్ పాల్గొన్నారు. ప్రజలకు, ఉద్యోగులకు అండగా నిలుస్తూ మరింత సేవలందించాలని మాజీ సర్పంచ్ పూట్కూరి రాజశేఖర్ రెడ్డి ఆకాంక్షించారు.

## సత్తుపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ నూతన మండల అధ్యక్షుల ప్రమాణ స్వీకారం

**నవగీతం ,జూన్ 14, ?సత్తుపల్లి ప్రతినిధి:** ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని పలు మండలాల నూతన కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుల ప్రమాణ స్వీకార మహోత్సవం వైభవంగా జరిగింది. సత్తుపల్లిలోని వై.ఎం.ఆర్ గార్డెన్స్ వేదికగా జరిగిన ఈ వేడుకలో తల్లాడ మండల కాంగ్రెస్ నూతన అధ్యక్షుడిగా గొడుగునూరి లక్ష్మీరెడ్డి, సత్తుపల్లి మండల అధ్యక్షుడిగా భీమిరెడ్డి సుబ్బారెడ్డి, వేంసూర్ మండల అధ్యక్షుడిగా కాసర చంద్రశేఖర్ రెడ్డి అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు.?ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మాట్లాడుతూ.. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తామని, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ నిరంతరం ప్రజాసేవలో ఉంటామని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి శ్రమిస్తామని వారు పేర్కొన్నారు.?ఈ ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమానికి నియోజకవర్గ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు భారీ సంఖ్యలో తరలివచ్చిన కార్యకర్తలు హాజరై, నూతన బాధ్యతలు చేపట్టిన నాయకులకు పూలమాలలు వేసి ఘనంగా శుభాకాంక్షలు తెలియజేశారు.

## అక్రమ ఇసుక రవాణాపై వైరా పోలీసులు ఉక్కుపాదం

వ్యవస్థీకృత నేరాలకు పాల్పడుతున్న ఇసుక మాఫియాపై కఠిన చర్యలు
పునరావృత నేరస్తులపై హిస్టరీ షీట్లు, ప్రత్యేక నిఘా ఏర్పాటు






**నవగీతం, జూన్13, వైరా ప్రతినిధి:** ప్రభుత్వానికి చెందిన సహజ వనరులైన ఇసుకను అక్రమంగా తవ్వి, రవాణా చేసి విక్రయించడం ద్వారా ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగిస్తున్న ఇసుక మాఫియాపై వైరా పోలీసులు మరోసారి ఉక్కుపాదం మోపారు. వైరా పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వైరా ఏసీపీ సాదుల సారంగపాణి మాట్లాడుతూ, వైరా పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన వాహన తనిఖీల సందర్భంగా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ముఠాను గుర్తించి పట్టుకున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో వైరా సీఐ వెంకట ప్రసాద్, ఎస్ఐ పుష్పాల రామారావు, వైరా-2 ఎస్ఐ పవన్, చింతకాని ఎస్ఐ నరేష్, కొనిజర్ల ఎస్ఐ సూరజ్ పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం దోనబండ రీచ్ నుంచి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు, మైనింగ్ పర్మిట్లు, ట్రాన్స్‌పోర్ట్ చలానాలు లేదా ఈ-బిల్లులు లేకుండా సుమారు 25 టన్నుల ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసులో ఖమ్మం జిల్లాకు చెందిన చల్లమల్ల వెంకటేశ్వరరావు, ఆయన కుమారుడు చల్లమల్ల సుమంత్‌కుమార్, లారీ డ్రైవర్ కొండేటి ఉపేందర్‌లను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. అక్రమ ఇసుక రవాణాకు ఉపయోగించిన అశోక్ లేలాండ్ లారీ, ఎస్కార్ట్ వాహనంగా వినియోగించిన మహీంద్రా థార్ కారు, ఇసుక విక్రయాల కోసం ఉపయోగిస్తున్న టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దర్యాప్తులో నిందితులు ఆంధ్రప్రదేశ్‌లో తక్కువ ధరకు ఇసుక కొనుగోలు చేసి ఖమ్మంతో పాటు తెలంగాణలోని ఇతర ప్రాంతాల్లో అధిక ధరలకు విక్రయిస్తూ అక్రమ లాభాలు పొందుతున్నట్లు అంగీకరించినట్లు చెప్పారు. నిందితుల నేర చరిత్రను పరిశీలించగా, చల్లమల్ల సుమంత్‌కుమార్‌పై మొత్తం 12 క్రిమినల్ కేసులు నమోదై ఉండగా, కొన్ని కేసుల్లో శిక్షలు కూడా విధించబడినట్లు గుర్తించామని తెలిపారు. అలాగే చల్లమల్ల వెంకటేశ్వరరావుపై ప్రస్తుత కేసుతో కలిపి నాలుగు కేసులు నమోదైనట్లు వెల్లడించారు. గతంలో మోసం, దొంగతనం, అక్రమ ఇసుక రవాణా తదితర నేరాల్లో వీరి ప్రమేయం ఉన్నట్లు నిర్ధారణ అయిందన్నారు. అలవాటుగా నేరాలకు పాల్పడుతున్న వ్యక్తులపై హిస్టరీ షీట్లు తెరవడం, నిరంతర నిఘా ఏర్పాటు చేయడం, అవసరమైతే రౌడీషీట్లు నమోదు చేయడం వంటి కఠిన చర్యలు చేపడుతున్నట్లు ఏసీపీ తెలిపారు. అక్రమ ఇసుక తవ్వకం, రవాణా, నిల్వ, కొనుగోలు లేదా విక్రయాల్లో పాల్గొనే వ్యక్తులు, వాహన యజమానులు, డ్రైవర్లు, మధ్యవర్తులు లేదా సహకరించే ఎవరైనా చట్టపరమైన చర్యల నుంచి తప్పించుకోలేరని హెచ్చరించారు. ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగించడంతో పాటు పర్యావరణ సమతుల్యతను దెబ్బతీసే ఇటువంటి అక్రమ కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమన్నారు. అక్రమ ఇసుక రవాణా, నిల్వ లేదా విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిసిన ప్రజలు వెంటనే పోలీసులకు తెలియజేసి చట్ట పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. చట్టాన్ని ధిక్కరించే వారికి కఠిన చర్యలు తప్పవని, ఇసుక అక్రమ మాఫియాను ఏ రూపంలోనూ సహించబోమని స్పష్టం చేశారు.

## మైనర్లపై జరుగుతున్న దాడులపై రేవంత్ రెడ్డి స్పందించాలి

**తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత**



**నవగీతం,జూన్13, ఖమ్మం ప్రతినిధి:** ఖమ్మంలో 12 ఏళ్ల చిన్నారిపై అత్యాచారం ఘటనలో నిందితుడిని ఉరి తీసి బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. అత్యాచార ఘటనలో తీవ్రంగా గాయపడి నిమ్స్ లో చికిత్స పొందుతున్న చిన్నారిని ఇవాళ కవిత పరామర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఆమె.. మైనర్లపై రోజూ దారుణాలు జరుగుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. హోంమంత్రిగా కూడా ఉన్న ముఖ్యమంత్రి వెంటనే స్పందించి ఇటువంటి దారుణాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఘటనలో నిందితుడిని ఉరితీసి బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. అలాగే బాలికకు నెలకు రూ.50 వేల పింఛన్, తల్లిదండ్రులకు ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

## మాదక ద్రవ్యాల నిర్మూలనకు జగిత్యాల ఐఎంఏ ముందడుగు.

ఐఎంఏ చేపట్టే యాంటీ డ్రగ్ 3కే రన్ కరపత్రాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్.





**నవగీతం,జూన్13, జగిత్యాల ప్రతినిధి:** ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (×పీూ) జగిత్యాల శాఖ ఆధ్వర్యంలో జూన్ 26, 2026న నిర్వహించనున్న "యాంటీ డ్రగ్ 3కే రన్" కరపత్రాన్ని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, యువతను లక్ష్యంగా చేసుకుని సమాజాన్ని పట్టిపీడిస్తున్న మాదకద్రవ్యాల వ్యసనం దేశ భవిష్యత్తుకు తీవ్రమైన ముప్పుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ దుర్వినియోగంపై ప్రజల్లో, ముఖ్యంగా యువతలో అవగాహన పెంపొందించేందుకు ఐఎంఏ జగిత్యాల చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ఆయన అభినందించారు. సమాజంలో ఆరోగ్యకరమైన జీవన విధానాలను ప్రోత్సహించేందుకు వైద్యులు ముందుకు రావడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. "రన్ స్ట్రాంగ్ -- లివ్ ఫ్రీ, సే నో టు డ్రగ్స్" అనే నినాదంతో నిర్వహించనున్న ఈ 3కే రన్ పాత బస్టాండ్ దగ్గర లోని శ్రీ వివేకానంద మినీ స్టేడియం నుండి ఐఎంఏ భవన్ వరకు జరగనుంది. విద్యార్థులు, యువత, వైద్యులు, ప్రజాప్రతినిధులు మరియు అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మాదకద్రవ్యాల వ్యతిరేక సందేశాన్ని సమాజానికి చాటాలని ఆయన పిలుపునిచ్చారు.. డాక్టర్ ఆకుతోట శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. యువతను వ్యసనాల బారిన పడకుండా కాపాడేందుకు ప్రజల్లో చైతన్యం తీసుకురావడం కోసం ఈ అవగాహన పరుగు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని, యువత ఆరోగ్యవంతమైన భవిష్యత్తు కోసం డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సంకల్పిద్దామని వారు పిలుపునిచ్చింది. ఈ యాంటీ డ్రగ్ 3కే రన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ జగిత్యాల కార్యదర్శి డాక్టర్ ఆకుతోట శ్రీనివాస రెడ్డి, కోశాధికారి డాక్టర్ కోటగిరి సుధీర్ కుమార్, డాక్టర్ వడ్లూరి శ్రవణ్ కుమార్, డాక్టర్ బండెల విజయ్ , డాక్టర్ ఇనుగురతి రాజశేఖర్ పాల్గొన్నారు.

## ఉప ముఖ్యమంత్రికి స్వాగతం పలికిన మంత్రి అడ్లూరి..



**నవగీతం,జూన్13,జగిత్యాల/ధర్మపురి:** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క మంచిర్యాల జిల్లా పర్యటన సందర్భంగా ధర్మపురి మండలం రాయపట్నం వద్ద రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. మంత్రి వెంట పెద్దపల్లి ఎంపీ వంశీ కృష్ణ, జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్ తో పాటు ధర్మపురి నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వరి విత్తనోత్పత్తిలో బై-బ్యాక్ విధానం రైతులకు భరోసా

లిఖితపూర్వక ఒప్పందాలతోనే విత్తనోత్పత్తి చేపట్టాలని వ్యవసాయ శాఖ సూచన



**నవగీతం,జూన్13, కోరుట్ల/కథలాపూర్:** వ్యవసాయంలో పెరుగుతున్న అనిశ్చిత పరిస్థితులు, వాతావరణ మార్పులు, అకాల వర్షాలు, కరువు పరిస్థితులు, చీడపీడల ప్రభావం వంటి సవాళ్ల మధ్య రైతులకు భరోసా కల్పించే విధానంగా బై-బ్యాక్ విత్తనోత్పత్తి నిలుస్తోందని మండల వ్యవసాయ శాఖ అధికారి కె.యోగితా తెలిపారు. బై-బ్యాక్ విధానంలో గుర్తింపు పొందిన విత్తన సంస్థలు రైతులకు ముందుగానే విత్తనాలు అందించి, పంట సాగు కాలంలో అవసరమైన సాంకేతిక సూచనలు చేస్తాయి. పంట కోత అనంతరం వచ్చిన విత్తన దిగుబడిని ముందస్తుగా కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం అదే సంస్థ తిరిగి కొనుగోలు చేస్తుంది. మార్కెట్‌లో ధరల హెచ్చుతగ్గులతో సంబంధం లేకుండా రైతులు ముందుగా నిర్ణయించిన ధరను పొందే అవకాశం ఉంటుంది. ఈ విధానం ద్వారా రైతులకు ముందస్తు ధరల హామీ, సాధారణ మార్కెట్ ధరల కంటే మెరుగైన ధరలు పొందే అవకాశం, సాంకేతిక సహాయం, ఆదాయ వృద్ధి వంటి ప్రయోజనాలు కలుగుతాయని అధికారులు పేర్కొన్నారు. అయితే కొంతమంది రైతులు అనధికారికంగా సీడ్ ఫారమ్‌ల నుంచి విత్తనాలు తీసుకువచ్చి ఎలాంటి ఒప్పందాలు లేకుండా విక్రయిస్తున్నారని, ఇది చట్టబద్ధమైన విధానం కాదని హెచ్చరించారు. రైతులు తప్పనిసరిగా లిఖితపూర్వక ఒప్పందాలు చేసుకోవాలని, విత్తన సంస్థకు చెల్లుబాటు అయ్యే లైసెన్స్ ఉందో లేదో పరిశీలించాలని సూచించారు. విత్తన రకం, కొనుగోలు ధర, నాణ్యత ప్రమాణాలు, చెల్లింపు విధానం వంటి అంశాలు ఒప్పందంలో స్పష్టంగా ఉండాలని తెలిపారు. అలాగే అనుమానాస్పద మధ్యవర్తుల ద్వారా విత్తనాలు కొనుగోలు చేయవద్దని, వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలని కోరారు. ఇక ఈ సంవత్సరం ఎల్-నినో ప్రభావం కారణంగా సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో రైతులు మార్కెట్ భద్రత కలిగిన పంటలపై దృష్టి సారించాలని సూచించారు. ఇటువంటి పరిస్థితుల్లో బై-బ్యాక్ విత్తనోత్పత్తి రైతులకు అదనపు ఆర్థిక భరోసా కల్పిస్తుందని అధికారులు పేర్కొన్నారు. అలాగే విత్తనోత్పత్తికి సంబంధించిన అగ్రిమెంట్ వివరాలను సంబంధిత మండల వ్యవసాయ అధికారి , వ్యవసాయ విస్తరణ అధికారి లకు తప్పనిసరిగా తెలియజేయాలని, పంట నమోదు సమయంలో సీడ్ ప్రొడక్షన్‌గా నమోదు చేయించుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు మార్కెట్‌లో అధిక డిమాండ్ ఉన్న సన్న రకాల వరి సాగు చేపట్టి మంచి ఆదాయం పొందాలని రైతులకు వ్యవసాయ శాఖ విజ్ఞప్తి చేసింది.

నవగీతం
తెలుగు దినపత్రిక
ఆదివారం
14 జూన్ 2026

# సింగరేణికి నష్టం చేసింది బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు..








**రెండు పార్టీలతో సింగరేణికి రూ. 9647 కోట్ల నష్టం..**

**సింగరేణి పరిరక్షణ కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం..**

**కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉంటే ప్రజాస్వామ్యానికి ముప్పు..**

**ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క..**

**నవగీతం,జూన్13, మంచిర్యాల ప్రతినిధి:** సింగరేణి సంస్థకు నష్టం తీసుకువచ్చింది బీఆర్ఎస్, బీజేపీ పార్టీలని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. రెండు పార్టీల పరిపాలనలో సింగరేణి సంస్థలు వేల కోట్ల నష్టం జరిగిందని సింగరేణికి అన్యాయం చేసిన రెండు పార్టీలు ప్రజా ప్రభుత్వం పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని భట్టి విక్రమార్క మండిపడ్డారు. శనివారం మంచిర్యాల జిల్లాలో పర్యటించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రాష్ట్ర మంత్రులు దుద్దిల్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మెదట దండేపల్లి మండలం గూడెం గుట్టలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రులతో కలిసి ఉపముఖ్యమంత్రి పాల్గొన్నారు. రూ. 70 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులకు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు. సింగరేణి సంస్థలో 335 మందికి కారుణ్య నియామక పత్రాలను మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నియామక పత్రాలను మంత్రులతో కలిసి ఉపముఖ్యమంత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి తాను చేపట్టిన పాదయాత్ర సందర్భంగా సింగరేణి కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని ఇచ్చిన హామీ ప్రకారం సింగరేణి కార్మికుల సమస్యలను పరిష్కరిస్తున్నామని భట్టి వివరించారు. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా సింగరేణి కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే కోటి 25 లక్షల రూపాయల ప్రమాద బీమా కల్పించామని భట్టి వివరించారు. సింగరేణి సంస్థకు బీఆర్ఎస్, బీజేపీ పార్టీ చేసిన నష్టం సింగరేణి చరిత్రలో ఇప్పటి వరకు ఎవరు చేయలేదని భట్టి ఆరోపించారు. తెలంగాణ ఎంపీగా గెలిచిన కిషన్ రెడ్డి కేంద్ర క్యాబినెట్ లో మంత్రిగా ఉండి సింగరేణికి చెందాల్సిన రెండు బొగ్గు బ్లాక్ లను తన వద్ద పెట్టుకొని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే ప్రయత్నం చేశారని భట్టి విక్రమార్క అన్నారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉన్న సమయంలో బొగ్గు బ్లాక్ ల వేలంలో పాల్గొనకుండా చేయడం ద్వారా సింగరేణి సంస్థకు రూ. 9647 కోట్ల నష్టం జరిగిందని భట్టి అన్నారు. రెండు పార్టీలతో నష్టం జరిగినప్పటికీ దొంగే దొంగ అన్నట్లు ప్రస్తుతం సింగరేణిపై రెండు పార్టీలు మాట్లాడుతున్నాయని బట్టి వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ పార్టీ సింగరేణికి గోదావరికి అన్యాయం చేసిందని భట్టి ఆరోపించారు. వందేళ్లకు పైగా చరిత్ర ఉన్న సింగరేణి సంస్థ రోజువారి పనుల్లో ప్రభుత్వ జోక్యం ఉండదని భట్టి తెలిపారు. సింగరేణిలో మెడికల్ బోర్డు కొనసాగుతుందని మారు పేర్లపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని భట్టి హామీ ఇచ్చారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న కేసీఆర్ చేసిన అప్పులు రాష్ట్రానికి గుదిబండగా మారాయని ఉప ముఖ్యమంత్రి అన్నారు. ప్రతి నెల సుమారుగా 7వేల కోట్ల రూపాయలు కేసీఆర్ చేసిన అప్పులకు వడ్డీలు చెల్లిస్తున్నామని ఏడాదికి సుమారుగా రూ. 74 వేల కోట్లు వరకు చెల్లిస్తున్నామని భట్టి వివరించారు. పదేళ్లపాటు మంత్రిగా పని చేసిన హరీష్ రావు సింగరేణి పై ప్రజా ప్రభుత్వం పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని భట్టి మండిపడ్డారు. సింగరేణిలో 335 మందికి కారుణ్య నియామక పత్రాలను అందజేస్తున్నామని విషయం తెలిసి ప్రజల్లో కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ఆదరణను తగ్గించడానికి హరీష్ రావు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని భట్టి వివరించారు. హరీష్ రావు ఆరోపణలపై ప్రజలకు వాస్తవాలను వివరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బట్టి అన్నారు. బీజేపీ అధికారంలో ఉంటే ప్రజాస్వామ్యానికి పెను ముప్పుగా భావించాలని భట్టి అన్నారు. మీనాక్షి నటరాజన్ పై తెలంగాణలోని ఏ పోలీస్ స్టేషన్ లో ఎఫ్ఐఆర్ నమోదు కాలేదని భట్టి స్పష్టం చేశారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉంటే రానున్న రోజుల్లో సర్పంచ్ నుండి మొదలుకొని పార్లమెంటు సభ్యుల వరకు వాళ్లకు నచ్చిన వ్యక్తులు గెలిచే విధంగా నామినేషన్ సమయంలో నిర్ణయాలు తీసుకొని వ్యతిరేక వ్యక్తుల నామినేషన్ తిరస్కరిస్తారని భట్టి అన్నారు. మీనాక్షి నటరాజన్ వ్యవహారం ప్రజాస్వామ్యవాదులు ఒక హెచ్చరికగా భావించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి అన్నారు.

**సింగరేణి పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం: మంత్రి శ్రీధర్ బాబు..**

కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి పక్షపాతి అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. గతంలో టీఆర్ఎస్, బీఆర్ ఎస్ ప్రభుత్వం ఇంటి సంస్థగా సింగరేణి సంస్థను ఉపయోగించుకుందని మంత్రి శ్రీధర్ బాబు ఆరోపించారు. సింగరేణి సంస్థ పై మాజీ మంత్రి హరీష్ రావు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని సింగరేణి నుండి ఒక టన్ను బొగ్గు పక్కదారి పట్టించే అవకాశం లేదని మంత్రి అన్నారు. సింగరేణి సంస్థ పరిరక్షణ ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని గత ప్రభుత్వం సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను గుర్తించలేదని తాము అధికారంలోకి వచ్చిన తర్వాత లాభాల వాటాలో కాంట్రాక్టు కార్మికులకు సైతం రూ. 5వేలు చెల్లించామని బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో సింగరేణిలో కొత్త పాలసీలు చేస్తే ఎవరు వద్దన్నారు అని మంత్రి శ్రీధర్ బాబు ప్రశ్నించారు. రాష్ట్రం నుండి 8 మంది బిజెపి ఎంపీలు ఉన్నప్పటికీ సింగరేణి కార్మికుల ఇన్ కామ్ టాక్స్ విషయంలో కేంద్ర ప్రభుత్వాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదని శ్రీధర్ బాబు ప్రశ్నించారు. సింగరేణిలో బీఆర్ఎస్, బిజెపి ప్రభుత్వం హయాంలో జరిగిన అవినీతిపై విచారణ జరిపిస్తామని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఆర్టీసీ కార్మికులతో పాటు సింగరేణి కార్మికుల పోరాట పటిమ మరువలేనిదని రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆర్టీసీ సింగరేణి సంస్థల్లో సుమారు 40 వేల చొప్పున కార్మికులు ఉన్నారని రెండు సంస్థలను కాపాడుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని మంత్రి పొన్నం అన్నారు. సింగరేణి కార్మికులను రెచ్చగొట్టే విధంగా మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతున్నారని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. సింగరేణి కార్మికులు బిడ్డగా కార్మికుల సమస్యలు తెలుసని అన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి అడ్లూరి అన్నారు. కార్మికులకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని కార్మికుల కష్టాల్లో కాంగ్రెస్ పార్టీ భాగమై ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ సాగరం ప్రేమ్ సాగర్ రావు, బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్, భూపాలపల్లి ఎమ్మెల్యే సత్యనారాయణ రావు, రామగుండం ఎమ్మెల్యే రాజు ఠాగూర్ తో పాటు సింగరేణి ఐ ఎన్ టీ సీ నాయకులు అధికారులు పాల్గొన్నారు.

## ఏడో వార్డు బ్రాహ్మణపల్లిలో విద్యుత్ ట్రాన్స్ఫారం ఏర్పాటు



**నవగీతం ,జూన్13, వైరాప్రతినిధి** వైరా మున్సిపాలిటీ ఏడో వార్డులోని బ్రాహ్మణపల్లి లో వోల్టేజ్ సమస్య కారణంగా నూతనంగా ఏర్పాటుచేసిన ట్రాన్స్ఫార్ ను మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళ ఏడో వార్డు కౌన్సిలర్ ప్రణతి సైదులు ప్రారంభించారు ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ వైరా మున్సిపాలిటీలో విద్యుత్ లో వోల్టేజ్ సమస్య పరిష్కారాన్ని కృషి చేస్తానని తెలిపారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు చెరుకూరి చలపతిరావు విద్యుత్ శాఖ డి ఈ రమేష్, ఏడి కిరణ్,ఏ. ఈ పాలేటి పవన్ సాయి, చెరుకూరి శ్రీను వాసరావు చెరుకూరి శ్రీను చెరుకూరు గోపాల్ రావు ఎస్కే అక్బర్ విద్యుత్ శాఖ ఫోర్ మెన్ స్థానికులు పాల్గొన్నారు

## పాలడుగు ఉపాధి పనుల్లో రక్తపింజర పాము కలకలం

**నవగీతం,జూన్13, వైరాప్రతినిధి:** వైరా మండలంలోని పాలడుగు గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల సమయంలో రక్తపింజర పాము కనిపించడంతో ఉపాధి కూలీల్లో ఒక్కసారిగా భయాందోళనలు నెలకొన్నాయి. శనివారం ఉదయం పనులు నిర్వహిస్తున్న సమయంలో పొదల మధ్య నుంచి పాము బయటకు రావడంతో ఉపాధి కూలీలు అప్రమత్తమై వెంటనే పనులను నిలిపివేశారు. ఉపాధి కూలీల సమాచారం మేరకు,పాము కొంతసేపు పనుల ప్రదేశం చుట్టూ సంచరించడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. అనంతరం ఉపాధి కూలీలు జాగ్రత్తగా పామును పట్టుకొని చంపేయడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం, గాయాలు జరగలేదు. ఈ సందర్భంగా ఉపాధి పనులకు హాజరైన కూలీలు మాట్లాడుతూ,వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో పొదలు,చెట్ల ప్రాంతాల్లో విషపాముల సంచారం పెరుగుతోందని తెలిపారు. పనులు చేపట్టే ముందు సంబంధిత అధికారులు ప్రదేశాలను పరిశీలించి భద్రతా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ ఘటనతో కొంతసేపు ఉపాధి పనులకు అంతరాయం ఏర్పడగా, పరిస్థితి సాధారణ స్థితికి చేరుకున్న తర్వాత పనులను తిరిగి ప్రారంభించారు. ఉపాధి పనుల వద్ద రక్తపింజర పాము కనిపించడం చర్చనీయాంశంగా మారింది.



## ప్రకృతి పరిరక్షణే లక్ష్యంగా జేఎన్టీయూహెచ్‌లో మొక్కలు నాటిన విద్యార్థులు

**హైదరాబాద్ :** జేఎన్‌టీయూహెచ్: ప్రధాన మంత్రి సూచనల మేరకు ప్రకృతి పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం, పర్యావరణ సమతుల్యతను కాపాడడం లక్ష్యంగా ఖష్త్రఆ స్కాలర్ చల్ల రామకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో జేఎన్‌టీయూహెచ్ క్యాంపస్‌లో మొక్కలు నాటే కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి జేఎన్‌టీయూహెచ్ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. ఎల్. సైదా నాయక్ ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలు నాటడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు.

## వర్షంలోనూ ప్రజాసేవలో సైబరాబాద్ పోలీసులు

**సైబరాబాద్ :** కమిషనరేట్ పరిధిలో ఈరోజు కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ మరియు లా అండ్ ఆర్డర్ పోలీసు అధికారులు, సిబ్బంది రోడ్లపై ప్రత్యేకంగా విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రధాన కూడళ్లు, ట్రాఫిక్ రద్దీ ప్రాంతాలు, నీరు నిలిచే ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు వాహనాల రాకపోకలను నియంత్రిస్తూ ట్రాఫిక్ సజావుగా సాగేలా చర్యలు చేపడుతున్నారు. అదే విధంగా లా అండ్ ఆర్డర్ సిబ్బంది ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందిస్తూ, వర్షం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి అండగా నిలుస్తున్నారు. వర్షపు నీటితో నిండిన ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తూ, ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా సూచనలు చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందన అందించేందుకు అన్ని పోలీసు యంత్రాంగాలు అప్రమత్తంగా పనిచేస్తున్నాయి. ప్రజలు కూడా అవసరమైతే తప్ప బయటకు రావద్దని, వాహనదారులు జాగ్రత్తగా ప్రయాణించాలని, ట్రాఫిక్ పోలీసుల సూచనలను పాటించాలని సైబరాబాద్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## తెలంగాణ, ఏపీలో వాన బీభత్సం

**హైదరాబాద్ :** తెలుగు రాష్ట్రాల్లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. శుక్రవారం సాయంత్రం నుంచే తెలంగాణలోని పలు జిల్లాల్లో వర్షం మొదలైంది. హైదరాబాద్? వాతావరణ శాఖ రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేస్తూ ప్రజలు అప్రమత్తం చేసింది. ముఖ్యంగా అర్ధరాత్రి వరకు ఉరుములతో కూడిన భారీ వర్షాలు పడతాయని వాతావరణ కేంద్రం అంచనా వేసింది. మహబూబాబాద్, నిజామాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, వరంగల్, యాదాద్రి జిల్లాల్లో వాన తీవ్రత అధికంగా ఉంది. ఈ జిల్లాల్లో గంటకు 60కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. మిగిలిన జిల్లాలకు కూడా వర్ష సూచన ఉండటంతో వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

**హైదరాబాద్‌లో రోడ్లన్నీ జలమయం**

హైదరాబాద్ మహానగరంలో రాత్రి వేళలో ఆకాశం మేఘావృతమై కుండపోత వర్షం కురిసింది. ఉరుములు,మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వానకు నగరంలోని రహదారులన్నీ జలమయమ్యాయి. ఎర్రగడ్డ, పంజాగుట్ట, ఖైరతాబాద్, లక్డీకాపూల్ వంటి ప్రాంతాల్లో వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. బేగంపేట, ప్యాట్నీ సెంటర్, జేబీఎస్, సికింద్రాబాద్, ఉప్పల్, ఎల్బీనగర్ వంటి ప్రాంతాల్లో భారీ వర్షం కారణంగా ట్రాఫిక్ నిలిచిపోయింది. ఆఫీసుల నుంచి ఇళ్లకు వెళ్లే వాహనదారులు వర్షం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోడ్లపై నీరు నిలిచిపోవడంతో ప్రయాణం ప్రమాదకరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాగర్ కర్నూల్, మహబూబ్‌నగ్, గద్వాల్, నారాయణపేట జిల్లాలకు ఎల్లో అలర్ట్ కొనసాగుతోంది . సిద్ధిపేట, సిరిసిల్ల, భువనగిరి కరీంనగర్, కామారెడ్డి జిల్లాల్లో కూడా ఉరుముల వర్షం పడవచ్చు. సంగారెడ్డి, మేడ్చల్ పరిసరాల్లో కూడా వాతావరణం చల్లబడి వర్షం కురుస్తోంది.

# 12 ఏళ్ల ప్రధాని మోదీ పాలన చారిత్రాత్మకం2047 నాటికి 'వికసిత్ భారత్' సాధనే లక్ష్యం




**హైద్రాబాద్ :** గడిచిన 12 ఏళ్ల ప్రధాని నరేంద్ర మోదీ గారి సుపరిపాలనలో భారతదేశం అంతర్జాతీయ వేదికలపై తిరుగు లేని గౌరవాన్ని, శక్తివంతమైన గుర్తింపును సాధించిందని బిజెపి అధికార ప్రతినిధి డాక్టర్ ప్రభా గౌడ్ అన్నారుభాగ్యనగర్ జిల్లా ? మలక్‌పేట్ లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాల విస్తరణ మరియు భారతదేశ ప్రగతికి తీసుకున్న కీలక నిర్ణయాల గురించి మీడియా సమావేశం లో వివరించారు. అలాగే కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పలు ప్రజాహిత కార్యక్రమాల వల్ల దేశవ్యాప్తంగా ప్రజలకు కలిగిన ప్రయోజనాలను వెల్లడించారు. గతంలో అంతర్జాతీయ వేదికలపై భారత్ మాటలకు ప్రాధాన్యత ఉండేది కాదు.. నేడు ప్రపంచ దేశాలన్నీ భారత్ వైపు చూస్తున్నాయి. 12 ఏళ్ల ప్రధాని మోదీ పాలన చారిత్రాత్మకం - 2047 నాటికి 'వికసిత్ భారత్' సాధనే లక్ష్యం. ప్రధాని నరేంద్ర మోదీ ప్రజాస్వామ్యబద్ధంగా, ప్రజలచే ఎన్నికై, అత్యంత సుదీర్ఘకాలం దేశానికి సేవ చేసిన ప్రధానమంత్రిగా రికార్డు సృష్టించారని, ఇది సామాన్యమైన విజయం కాదని, ప్రజల అచంచల విశ్వాసానికి ప్రతీక అని కొనియాడారు. అంతర్జాతీయంగా అత్యంత ప్రజాదరణ పొందిన నాయకుడిగా మోదీ గుర్తింపు పొందారని పేర్కొంటూ, మోదీ నేతృత్వంలోని గడిచిన 12 సంవత్సరాల కాలం దేశ ప్రగతిలో, సంస్కరణల పరంగా చారిత్రాత్మకమైనవని, 2047 నాటికి భారతదేశం ఖచ్చితంగా 'వికసిత భారత్'గా మారి తీరుతుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాల విస్తరణ మరియు భారతదేశ ప్రగతికి తీసుకున్న కీలక నిర్ణయాల గురించి వివరించారు. అలాగే కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పలు ప్రజాహిత కార్యక్రమాల వల్ల దేశవ్యాప్తంగా ప్రజలకు కలిగిన ప్రయోజనాలను వెల్లడించారు. ఒక నమ్మకమైన నాయకుడికి ఉండాల్సిన నాలుగు గుణాలు? పారదర్శకత (ఇంటిగ్రిటీ), నిజాయితీ, పని చేసే సామర్థ్యం, ఇచ్చిన హామీలను ఫలితాలుగా మార్చే నైపుణ్యం? ప్రధాని మోదీ లో సంపూర్ణంగా ఉన్నాయని స్పష్టం చేశారు. బీజేపీ వచ్చే ఎన్నికల కోసం కాకుండా, రాబోయే తరం (నెక్ట్స్ జనరేషన్) భవిష్యత్తు కోసం ఆలోచిస్తుందని అన్నారు. ముస్లిం మహిళల జీవితాల్లో శాపంగా మారిన తీన్ తలాక్ సామాజిక దురాచారాన్ని చట్టబద్ధంగా రద్దు చేశామని, వక్ఫ్ చట్టాల్లో అవసరమైన సంస్కరణలను విజయవంతంగా తీసుకువచ్చామని డాక్టర్ ప్రభ గౌడ్ చెప్పారు. కొత్త పార్లమెంట్ భవనంలో చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్ కల్పించే చారిత్రాత్మక బిల్లును తీసుకువచ్చామని, మహిళలకు పూర్తి భాగస్వామ్యం, హక్కులు దక్కే వరకు తాము విశ్రమించబోమని, ఇది మోదీ ప్రభుత్వ గ్యారెంటీ అని స్పష్టం చేశారు. గడిచిన 12 ఏళ్లలో భారతదేశం ప్రపంచానికి ఒక ఆపద్బాంధవుడిగా, విశ్వబంధువుగా నిలిచిందని అన్నారు. 'వసుధైక కుటుంబకం' అనే సందేశాన్ని కేవలం మాటల్లో కాకుండా చేతల్లో చూపిన దేశం భారతదేశం అని, కోవిడ్ సంక్షోభ సమయంలో ప్రపంచవ్యాప్తంగా అవసరమైన వ్యాక్సిన్లలో 60% మనదేశంలోనేతయారయ్యాయని, 'వ్యాక్సిన్ మైత్రి' ద్వారా 100కు పైగా దేశాలకు 30 కోట్లకు పైగా కోవిడ్ వ్యాక్సిన్లను పంపిణీ చేశామని చెప్పారు. గత ప్రభుత్వాల హయాంలో ధనికులు మరింత ధనికులుగా, పేదలు మరింత పేదలుగా మారారని, కానీ తమ అంత్యోదయ విధానం వల్ల గత 12 ఏళ్లలో 25 కోట్ల మంది దేశ ప్రజలను పేదరిక రేఖకు ఎగువకు తీసుకువచ్చామని, అంతర్జాతీయ సంస్థల నివేదికలే దీనిని స్పష్టం చేస్తున్నాయని చెప్పారు. సమానత్వం (ఈక్వాలిటీ) విషయంలో ప్రపంచంలో భారత్ నేడు నాల్గవ స్థానానికి చేరిందని, రాబోయే 5 నుండి 8 ఏళ్లలో భారత్ ప్రపంచంలోనే నంబర్ వన్ స్థానానికి చేరుకుంటుందని నొక్కి చెప్పారు. గతంలో బ్యాంకు ఖాతా తెరవాలంటె సిఫార్సులు, సాక్ష్యాలు కావాల్సి వచ్చేదని, మోదీ గారు వచ్చాక 56 కోట్లకు పైగా జన్ ధన్ ఖాతాలు తెరిపించారని, ఇప్పుడు బ్యాంకే ప్రజల ఇంటి వద్దకు వస్తోందని అన్నారు. దీనివల్ల ఎలాంటి దళారీ వ్యవస్థ లేకుండా ఢిల్లీ నుండి పంపిన సొమ్ము నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే చేరుతోందన్నారు. గ్రామీణ మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ దేశంలో 12 కోట్లకు పైగా మరుగుదొడ్లను నిర్మించామని, 2019లో జల్ జీవన్ మిషన్ ప్రారంభించినప్పుడు కేవలం 17% ఇళ్లకు మాత్రమే సురక్షితమైన తాగునీరు అందుతుండగా, ఈరోజు ఆ సంఖ్య 82%కి చేరిందని, కోట్లాది మంది మహిళలకు నీటి కోసం మైళ్ల దూరం నడిచే కష్టం తప్పిందని పేర్కొన్నారు. పీఎం ఆవాస్ యోజన ద్వారా కోట్లాది ఇళ్లను మహిళల పేరిట రిజిస్ట్రేషన్ చేశామని, ఉజ్వల యోజన ద్వారా పొగ నుండి విముక్తి కల్పించామని, ఆయుష్మాన్ భారత్ ద్వారా రూ. 5 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తున్నామని వివరించారు. రాజులమని భావించే కాంగ్రెస్ నాయకులకు పేదరికం, గ్రామీణ బాధలు ఎప్పటికీ అర్థం కావని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు మరియు పార్టీ నాయకులుగా భాగ్యనగర్ జిల్లా అధ్యక్షులు నిరంజన్ యాదవ్ గారు, పార్టీ అధికార ప్రతినిధి చికోటి ప్రవీణ్ , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మధుకర్ రెడ్డి , సురేందర్ రెడ్డి , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీరేందర్ యాదవ్ , కార్యక్రమ సమన్వయకర్త నరసింహా పాల్గొన్నారు.

### జిల్లాలో 42 మంది బాల కార్మికులను పనిలో నుండి మరియు పోలీసు అధికారుల సహకారంతో

# బాల కార్మికులను రక్షించిన రూరల్ డెవలప్మెంట్ సొసైటీ

**వనపర్తి :** ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా రూరల్ డెవలప్మెంట్ సొసైటీ కలిసి నలభై రెండు మంది బాలలను బాల కార్మికత్వం నుండి రక్షించింది.ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా, ( రూరల్ డెవలప్మెంట్ సొసైటీ) జిల్లా పరిపాలన మరియు పోలీసు అధికారులతో సమన్వయం చేసుకొని నేడు నలభై రెండు మంది బాలలను బాల కార్మికత్వం నుండి రక్షించింది. బాల కార్మికత్వ నిర్మూలన కోసం జూన్ నెలను 'యాక్షన్ మంత్'గా పాటించాలని రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖలు, సంస్థలకు ఇచ్చిన ఆదేశాల మేరకు బాల కార్మికత్వం అధికంగా ఉన్న ప్రాంతాల్లో సంయుక్త తనిఖీలు మరియు రక్షణ చర్యలు చేపట్టబడ్డాయి.ఈ సందర్భంగా రూరల్ డెవలప్మెంట్ సొసైటీ జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించింది. ఈ కార్యక్రమాల్లో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, చట్ట అమలు సంస్థల ప్రతినిధులు, గ్రామ పెద్దలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు. రూరల్ డెవలప్మెంట్ సొసైటీ దేశంలోని అతిపెద్ద బాలల సంరక్షణ నెట్‌వర్క్ అయిన జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ లో భాగస్వామి సంస్థగా పనిచేస్తోంది. ఈ నెట్‌వర్క్‌లో 250కు పైగా భాగస్వామ్య సంస్థలు కలిసి దేశవ్యాప్తంగా బాలల రక్షణ వ్యవస్థను బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నాయి. రక్షించబడిన పిల్లల వయస్సు ఎనిమిది నుండి పదిహేడు సంవత్సరాల మధ్య ఉంది. వీరు అనేక నెలలుగా వివిధ వాణిజ్య సంస్థల్లో పనిచేస్తున్నట్లు గుర్తించారు. ప్రాథమిక విచారణలో వీరిలో చాలామంది అధిక పని గంటలు, తక్కువ వేతనాలు మరియు వారి శారీరక, మానసిక ఆరోగ్యానికి హానికరమైన ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేయవలసి వచ్చినట్లు వెల్లడైంది.రక్షణ చర్యల అనంతరం బాధ్యులపై చట్టపరమైన చర్యలు ప్రారంభించబడ్డాయి. అలాగే రక్షించబడిన పిల్లలకు పునరావాసం కల్పించడం, చట్టం ప్రకారం అందుబాటులో ఉన్న పరిహారం మరియు ఇతర హక్కులు పొందేలా చర్యలు తీసుకుంటున్నారు.జూన్ నెలను బాల కార్మికత్వ వ్యతిరేక 'యాక్షన్ మంత్'గా పాటిస్తున్నారు. బాలల అక్రమ రవాణా చైల్డ్ ట్రాఫికింగ్ బాల కార్మికత్వానికి ప్రధాన కారణాల్లో ఒకటి కావడంతో, పరిపాలన, పోలీసులు మరియు గ్రామీణ స్థాయి సంస్థలు అక్రమ రవాణాదారులను మరియు వారి నెట్‌వర్క్‌ను గుర్తించేందుకు కఠిన నిఘా నిర్వహిస్తున్నాయి. ఈ కాలంలో జిల్లా పరిపాలన, పోలీసులు మరియు పౌర సమాజ సంస్థలు సమన్వయంతో రక్షణ చర్యలు చేపట్టి, బాల కార్మికత్వంలో నిమగ్నమైన అక్రమ రవాణా బాధిత పిల్లలను గుర్తించే పనిని కూడా కొనసాగిస్తాయి.ఈ సందర్భంగా రూరల్ డెవలప్మెంట్ సొసైటీ




డైరెక్టర్ చిన్నమ్మ తామస్ మాట్లాడుతూబాల కార్మికత్వం నుండి రక్షించబడే ప్రతి చిన్నారి విద్య, భద్రత మరియు గౌరవంతో జీవించే తన హక్కును తిరిగి పొందినట్టే. బాల కార్మికత్వం పిల్లల బాల్యాన్ని, వారి ప్రాథమిక హక్కులను హరిస్తుంది. దీనిని అత్యంత అత్యవసరంగా ఎదుర్కోవాలి. ఏ పిల్లవాడి స్థానం పనిస్థలంలో కాదు ప్రతి పిల్లవాడి స్థానం పాఠశాలలోనే. బాల కార్మికత్వం మరియు బాలల అక్రమ రవాణా పరస్పర సంబంధం కలిగి ఉన్నందున, పిల్లలను రక్షించడం, అక్రమ రవాణాను అడ్డుకోవడం మరియు రక్షించబడిన ప్రతి చిన్నారికి అవసరమైన సంరక్షణ, పునరావాసం మరియు అవకాశాలు అందేలా మేము పరిపాలన మరియు చట్ట అమలు సంస్థలతో కలిసి నిరంతరం పనిచేస్తాము అని తెలిపారు.ఈ నెట్‌వర్క్ యొక్క ప్రధాన బలం పరస్పర అప్రమత్తత మరియు సహకారంలో ఉంది. దేశవ్యాప్తంగా జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ భాగస్వామ్య సంస్థలు బాలల అక్రమ రవాణా కేసులపై సమాచారాన్ని పంచుకుంటూ, ఒకరికొకరు కీలక సహాయ వ్యవస్థగా పనిచేస్తున్నాయి. ఈ నెట్‌వర్క్ యొక్క సమాచార మార్పిడి వ్యవస్థల ద్వారా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పిల్లలను గుర్తించడం, అన్వేషించడం మరియు రక్షించడం సాధ్యమైంది.ఏప్రిల్ 2023 నుండి మార్చి 2026 వరకు ఈ నెట్‌వర్క్ 1,45,000 కంటే ఎక్కువ మంది పిల్లలను అక్రమ రవాణా నుండి రక్షించింది. వీరిలో చాలా మంది బాల కార్మికత్వంలోకి బలవంతంగా నెట్టబడిన చిన్నారులే.

# ఎస్ఐఆర్.. రాజకీయ పార్టీల సహకారం కోరిన సీఈఓ



**హైదరాబాద్ :** తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) 2026 కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల సహకారాన్ని కోరుతూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) సి. సుదర్శన్ రెడ్డి శుక్రవారం సమావేశం నిర్వహించారు. అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటర్లుగా నమోదు చేయడమే కాకుండా, జాబితాలోని అవకతవకలను తొలగించి, అత్యంత పారదర్శకమైన ఓటర్ల జాబితాను రూపొందించడమే తమ లక్ష్యమని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.హైదరాబాద్‌లోని బీఆర్‌కేఆర్ భవన్‌లో జరిగిన ఈ సమావేశంలో, జూన్ 25 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభం కానున్న ఈ ప్రక్రియ విధివిధానాలను వివిధ పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఇంటింటి సర్వే, ఆన్‌లైన్ మరియు ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ, జూలై 31న ముసాయిదా జాబితా ప్రచురణ, అభ్యంతరాల పరిష్కారం, తుది జాబితా విడుదల వంటి వివిధ దశల గురించి అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. ఈ బృహత్తర కార్యక్రమానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ పూర్తి మద్దతును ప్రకటించారు.కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం, బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓలు) జూన్ 25 నుండి జూలై 24 వరకు ఇంటింటి సర్వేను నిర్వహిస్తారు. అనంతరం స్వీకరించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి జూలై 31న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు. అభ్యంతరాలు, విజ్ఞప్తుల స్వీకరణ ప్రక్రియ అనంతరం, పూర్తిస్థాయి పరిశీలన పూర్తి చేసి అక్టోబర్ 1న తుది జాబితాను విడుదల చేయనున్నట్లు సీఈఓ సుదర్శన్ రెడ్డి వెల్లడించారు.గత రెండు దశాబ్దాలలో రాష్ట్రంలో ఇంతటి సమగ్ర స్థాయిలో ఓటర్ల జాబితా ప్రక్షాళన జరగడం ఇదే మొదటిసారి. నకిలీ ఓట్లు, మరణించిన వారి పేర్లు, చిరునామా మారిన వారిని జాబితా నుంచి తొలగించడంతో పాటు, అర్హులైన కొత్త ఓటర్లను చేర్చడమే ఈ ప్రత్యేక సవరణ ముఖ్య ఉద్దేశం. నిబంధనల ప్రకారం క్షేత్రస్థాయి విచారణ జరపకుండా ఏ ఒక్కరి పేర్లను జాబితా నుంచి తొలగించబోమని, ఈ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరుగుతుందని అధికారులు భరోసా ఇచ్చారు. పౌరుల సందేహాల నివృత్తికి రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు.

**తెలంగాణలో రాజకీయాలు చేసే స్వేచ్ఛ పవన్ కల్యాణ్‌కు ఉంది: రేవంత్ రెడ్డి**

జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాజకీయ కార్యకలాపాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ఎవరైనా రాజకీయాలు చేయడానికి స్వేచ్ఛ ఉందని, పవన్ కల్యాణ్‌కు కూడా అదే వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఇటీవల పవన్ కల్యాణ్ నిర్వహించాలనుకున్న బహిరంగ సభకు అనుమతి నిరాకరించిన అంశంపై స్పందించిన సీఎం... ఆ నిర్ణయం పూర్తిగా శాంతిభద్రతల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తీసుకున్నదేనని వివరించారు. ఇందులో రాజకీయ కోణం ఏదీ లేదని స్పష్టం చేశారు.తెలంగాణ ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి రాజకీయ పార్టీకి, ప్రతి నాయకుడికి సమాన అవకాశాలు ఉన్నాయని రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో రాజకీయ కార్యక్రమాలు నిర్వహించడంపై ఎలాంటి ఆంక్షలు లేవని, నిబంధనల ప్రకారం ఎవరైనా తమ రాజకీయ కార్యకలాపాలు కొనసాగించవచ్చని తెలిపారు.ఇదే సమయంలో జాతీయ రాజకీయాలపై కూడా ఆయన స్పందించారు. ముఖ్యంగా మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ అంశాన్ని ప్రస్తావిస్తూ, ఆ ప్రక్రియపై అనుమానాలు వ్యక్తం చేశారు. ఎలాంటి తీవ్రమైన చట్టపరమైన అడ్డంకులు లేని పరిస్థితిలో నామినేషన్ తిరస్కరించడం ప్రశ్నలు లేవనెత్తుతోందన్నారు.ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల వ్యవస్థపై ఉందని, ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రతిపక్షాల అవకాశాలను పరిమితం చేసేలా వ్యవహరించడం సరైంది కాదని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణలో నిష్పక్షపాత ధోరణి అత్యంత ముఖ్యమని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా వ్యవస్థలు పనిచేయాలని రేవంత్ రెడ్డి సూచించారు.

## మోదీ 12 ఏళ్ల పాలనా స్ఫూర్తితో చీపురు పట్టి ఊడ్చి పైపుతో నీళ్లు చల్లి క్లాస్ రూంను అద్దంలా మార్చిన

**రాజన్న సిరిసిల్ల :** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సిరిసిల్ల కుసుమ రామయ్య జెడ్పి హెచ్ఎస్ లో స్వచ్ఛ పాఠశాల కార్యకర్తగా మారారు. ప్రధాని నరేంద్ర మోదీ 12 ఏళ్ల పాలనను పురస్కరించుకుని కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలను స్వచ్ఛ పాఠశాల పేరుతో శుభ్రం చేసే పనికి శ్రీకారం చుట్టారు. తన పార్లమెంట్ పరిధిలోని ప్రతి పాఠశాలను పరిశుభ్రంగా ఉంచాలంటూ బండి సంజయ్ ఇచ్చిన పిలుపు మేరకు శనివారం నియోజకవర్గ వ్యాప్తంగా బీజేపీ కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక ప్రజలంతా కలిసి తమ తమ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను పరిశుభ్రం చేశారు. సొంతంగా చీపురు తెచ్చుకుని, క్లాత్, మగ్గు, బకెట్ తెచ్చుకుని తరగతి గదులను క్లీన్ చేశారు. అందులో భాగంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ సైతం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కుసుమ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు విచ్చేశారు. స్వయంగా చీపురు పట్టి ఊడ్చారు. పైపు నీళ్లతో తరగతి గదిని క్లీన్ చేశారు. ఆ తరువాత శుభ్రంగా తుడిచారు. విద్యార్థులు కూర్చునే టేబుల్ కింద దుమ్ము ధూళి లేకుండా క్లీన్ చేశారు. తరగతి గదిలోని మూలమూలకు వెళ్లి చీపురు పట్టి ఊడ్చారు. నీళ్లతో క్లీన్ చేశారు. తరగతి ఆవరణలోనూ నీళ్లు చల్లారు. నీళ్లు చల్లి తరగతి గదులను పరిశుభ్రం చేస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్. కేంద్ర మంత్రి పిలుపు మేరకు కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో స్వచ్ఛ పాఠశాల పేరుతో తరగతి గదులను బీజేపీ కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక ప్రజలు శుభ్రం చేశారు. నీళ్లతో క్లీన్ చేశారు. చాలా చోట్ల కార్యకర్తలు సొంతంగా చీపురు, మగ్గు, బకెట్, క్లాత్ తీసుకొచ్చి శుభ్రం చేయడం కన్పించింది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ మోదీ 12 ఏళ్ల పాలనను పురస్కరించుకుని దేశవ్యాప్తంగా వివిధ వర్గాలను కలుస్తున్నాం. అనేక సభలు, సమ్మేళనాలు నిర్వహిస్తున్నాం. దేశంలో ఎక్కడా లేని విధంగా 'స్వచ్ఛ పాఠశాల పేరుతో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని అన్ని పాఠశాలలను పరిశుభ్రం చేయాలని నిర్ణయించాం. రాజకీయాలకు అతీతంగా మన పాఠశాలను మనం శుభ్రం చేసుకుందామని కోరాం. స్ఫూర్తిదాయకమైన సేవా కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరిస్తున్నారు. టీచర్లు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు కూడా పాల్గొని తమ వంతు బాధ్యతను నెరవేరుస్తున్నారు. శుక్రవారం ఏ స్కూల్ ను ఎవరెవరు శుభ్రం చేయాలనే విషయంపై శుక్రవారం నే టిఫిన్ బైఠక్' నిర్వహించాం. అందులో భాగంగా పాఠశాలలను శుభ్రం చేస్తున్నాం. దీంతోపాటు పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని కోరుతూ సోమవారం గ్రామాలు, మండలాల వారీగా ర్యాలీలు కూడా నిర్వహించబోతున్నాం. ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలన్నది నా సంకల్పం. అందులో భాగంగానే ప్రభుత్వ స్కూళ్లలో టెన్త్ చదివే విద్యార్థులందరికీ ఈసారి కూడా సైకిళ్లు అందించబోతున్నాం. టెన్త్ విద్యార్థులందరికీ నా వేతనం నుండి పరీక్ష ఫీజు చెల్లిస్తా.

## చుక్కలు చూపించిన బైకర్

## ఆర్టీసీ డ్రైవర్ తగ్గని పరిస్థితి

**హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలో ఓ ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యానికి, ఓ సామాన్య బైకర్ సాహసానికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. ట్రాఫిక్ నిబంధనలను బేఖాతరు చేస్తూ రాంగ్ రూట్‌లో బస్సును నడిపిన డ్రైవర్‌కు ఆ బైకర్ అడ్డుగా నిలిచి, చివరికి బస్సును వెనక్కి తిప్పేలా చేసి హీరోగా నిలిచాడు.వివరాల్లోకి వెళితే.. నగరంలోని రద్దీ ప్రాంతంలో ఓ ఆర్టీసీ డ్రైవర్ ట్రాఫిక్‌కు ఎదురుగా, రాంగ్ రూట్‌లో వేగంగా బస్సును నడుపుకుంటూ వచ్చాడు. అదే సమయంలో అటుగా వస్తున్న ఓ యువకుడు ఇది గమనించి ఏమాత్రం భయపడలేదు. తన బైక్‌ను ఆ బస్సుకు సరిగ్గా ఎదురుగా ఆపేశాడు. బస్సు వేగానికి ఇతరులు పక్కకు తప్పుకున్నా, అతను మాత్రం వెనకడుగు వేయలేదు.దీంతో ఆగ్రహానికి గురైన డ్రైవర్ బస్సును కుడివైపునకు తిప్పి ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించాడు. కానీ, ఆ బైకర్ కూడా పట్టువదలకుండా బస్సు వెళ్లే మార్గానికి మళ్లీ తన బైక్‌ను అడ్డంగా పెట్టాడు. దీంతో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. బైకర్ చర్యను చూసి రోడ్డుపై ఉన్న ఇతర వాహనదారులు కూడా అతనికి మద్దతుగా నిలిచారు.చుట్టూ జనం చేరడం, బైకర్ ఏమాత్రం తగ్గకపోవడంతో ఆర్టీసీ డ్రైవర్‌కు పరిస్థితి అర్థమైంది. చేసేదేమీ లేక, బస్సును నెమ్మదిగా వెనక్కి తిప్పక తప్పలేదు. ఈ నడిరోడ్డు హైడ్రామాను అక్కడున్న వారు తమ సెల్‌ఫోన్లలో చిత్రీకరించారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లు బైకర్ ధైర్యాన్ని మెచ్చుకుంటూ కామెంట్లు పెడుతున్నారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన ఆర్టీసీ డ్రైవర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేస్తున్నారు.

## బంజారాహిల్స్‌లో దౌర్జన్యం..

## ట్రాఫిక్ పోలీసుపై చేయి చేసుకున్న అధికారులు!

**హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో విధి నిర్వహణలో ఉన్న ఒక ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై ఇద్దరు జీహెచ్ఎంసీ అధికారులు దాడికి పాల్పడటం తీవ్ర సంచలనం సృష్టించింది. నిబంధనలకు విరుద్ధంగా వెళుతున్న వాహనాన్ని అడ్డుకోవడంతో, వారు తనపై భౌతిక దాడికి దిగారని బాధితుడు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.జూన్ 11, గురువారం నాడు బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లూసిడ్ బైలేన్‌లో ట్రాఫిక్ కానిస్టేబుల్ ఇ. శ్రీశైలం విధులు నిర్వర్తిస్తున్నారు. ఆ రహదారిపై నాలుగు చక్రాల వాహనాల ప్రవేశం నిషిద్ధం. అయితే, ఆ సమయంలో అటుగా వచ్చిన ఒక గ్రీన్ కలర్ క్రెటా కారును శ్రీశైలం నిలిపివేశారు. దీంతో కారులో ఉన్న జీహెచ్ఎంసీ అసిస్టెంట్ ఇంజనీర్, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్ సహాయకుడు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు.కారు డ్రైవర్ తనను దుర్భాషలాడటమే కాకుండా, ఉద్యోగం నుంచి తొలగిస్తానంటూ బెదిరింపులకు పాల్పడినట్లు శ్రీశైలం తన ఫిర్యాదులో పేర్కొన్నారు. వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించేందుకు ప్రయత్నించగా, తనపై చేయి చేసుకుని కాలితో తన్నారని ఆరోపించారు. అనంతరం వారు బారికేడ్లను తొలగించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ ఘటనను శ్రీశైలం తన మొబైల్ ఫోన్‌లో చిత్రీకరించగా, సదరు వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగిని అడ్డుకోవడం, దాడి చేయడం, శాంతి భద్రతలకు విఘాతం కలిగించడం మరియు బెదిరింపులకు పాల్పడటం వంటి అభియోగాలపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నిందితులైన ఇద్దరు అధికారులను విచారణకు పిలిపించామని, ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు.

## ఈషా సింగ్‌కు సత్కారం

**హైదరాబాద్ :** మ్యూనిచ్లో జరిగిన ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచకప్ 2026లో మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్లో స్వర్ణపతకం గెలుపొంది ప్రపంచ రికార్డు సృష్టించిన ప్రపంచ ఛాంపియన్, షూటర్, అర్జున అవార్డీ ఈషా సింగ్ 'మీట్ అండ్ గ్రీట్' కార్యక్రమం బంజారాహిల్స్ లోని లీలా హోటల్లో జరిగింది. లైఫ్ స్పాన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జయేశ్ రంజన్, గౌరవ అతిథులుగా రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ వైస్ ఛైర్పర్సన్, ఎండీ, ఐఎఫ్ఎస్ అధికారిణి సోనీ బాలదేవి, నగరంలోని బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్, లైఫ్ స్పాన్ సంస్థ వ్యవస్థాపకుడు డా. నరేంద్ర రామ్ నంబుల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈషా సింగ్ ను సత్కరించారు

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఘన స్వాగతం

**కరీంనగర్ :** మంచిర్యాల జిల్లా పర్యటనకు వెళ్తూ మార్గమధ్యంలో కరీంనగర్ చేరుకున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కొద్దిసేపు ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో ఆగారు.ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, ఇతర ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారితో కలిసి జిల్లాలోని తాజా పరిస్థితులు, జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు.జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు సమర్థవంతంగా చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి, డీఆర్వో స్వామి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న, అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్, ఆర్డీవో షర్మిలతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌ను అన్ని హంగులతో

## ప్రారంభానికి సిద్ధం చేయండి

**యుద్ధ ప్రాతిపదికన పనులన్నీ పూర్తి కావాలి:**

**జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**



**కరీంనగర్ :** పోలీస్ కమిషనర్ గౌష్ ఆలంతో కలిసి నూతన కలెక్టరేట్ భవనం పరిశీలన.కరీంనగర్ నూతన కలెక్టరేట్ భవనాన్ని అన్ని హంగులతో ప్రారంభానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో శనివారం పోలీస్ కమిషనర్ గౌష్ ఆలంతో కలిసి నూతన కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టరేట్ ప్రధాన గేటు, కాంపౌండ్ వాల్ నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన కలెక్టర్, రోడ్లు-భవనాల శాఖ అధికారులకు,కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. మిగిలిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి, ప్రారంభోత్సవానికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనకు ముందే అన్ని అభివృద్ధి,మౌలిక సదుపాయాల పనులు పూర్తి అవ్వాలని స్పష్టం చేశారు.అనంతరం ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలించి, భద్రతా ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్లోని హెలిప్యాడ్ నుంచి అంబేద్కర్ స్టేడియం వరకు ఉండే రోడ్డు మార్గాన్ని పరిశీలించి, రాకపోకలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా భద్రత, ట్రాఫిక్ నిర్వహణ, ప్రోటోకాల్ ఏర్పాట్లు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ డి. శ్రీనివాస్ రెడ్డి, ఆర్ అండ్ బి శాఖ ఈఈ నరసింహాచారి, కరీంనగర్ టౌన్ ఏసిపి వెంకటస్వామి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 'పెద్ది' బాక్సాఫీస్ దూకుడు .. 9 రోజుల్లో రూ.366 కోట్ల గ్రాస్, 400 కోట్ల క్లబ్‌కు చేరువ!




। మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా నటించిన 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద విజయవంతమైన ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. దర్శకుడు బుచ్చిబాబు సన తెరకెక్కించిన ఈ ఎమోషనల్ స్పోర్ట్స్ డ్రామా ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ పొందుతూ భారీ వసూళ్లతో దూసుకుపోతోంది. విడుదలైన తొలి రోజు నుంచే పాజిటివ్ రెస్పాన్స్ అందుకున్న ఈ చిత్రం ఇప్పుడు రామ్ చరణ్ కెరీర్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన సోలో చిత్రంగా నిలిచే దిశగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా సంచలన వసూళ్లు నమోదు చేసిన 'పెద్ది' తాజాగా మరో కీలక మైలురాయిని అందుకుంది. సినిమా విడుదలై తొమ్మిది రోజులు పూర్తయిన సందర్భంగా చిత్ర నిర్మాణ సంస్థ అధికారికంగా కలెక్షన్ల వివరాలను ప్రకటించింది. మేకర్స్ వెల్లడించిన సమాచారం ప్రకారం, 'పెద్ది' ప్రపంచవ్యాప్తంగా తొలి తొమ్మిది రోజుల్లో ఏకంగా రూ. 366 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించింది. ఈ భారీ వసూళ్లతో రామ్ చరణ్ కెరీర్‌లో 'పెద్ది' రెండో అతిపెద్ద గ్రాసర్‌గా నిలిచింది. ముఖ్యంగా సోలో హీరోగా చరణ్ నటించిన చిత్రాల్లో అత్యధిక వసూళ్లు రాబట్టిన సినిమాగా ఇది రికార్డు సృష్టించింది. గ్రామీణ నేపథ్యం, క్రీడా అంశాలు, భావోద్వేగాలతో కూడిన కథ ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి సినిమాకు మంచి ఆదరణ లభిస్తోంది. ప్రస్తుతం వీకెండ్ బుకింగ్స్ కూడా ఆశాజనకంగా ఉన్నట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలతో పాటు ఉత్తర భారతదేశం, విదేశీ మార్కెట్లలో కూడా సినిమా మంచి వసూళ్లు నమోదు చేస్తోంది. ఈ నేపథ్యంలో 'పెద్ది' త్వరలోనే రూ. 400 కోట్ల గ్రాస్ క్లబ్‌లోకి చేరడం ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. తెలుగు వార్తలు వీకెండ్ ముగిసే నాటికి ఈ చిత్రం 400 కోట్ల మార్కును అందుకుంటుందా లేదా అనే అంశంపై సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది. ప్రస్తుతం మార్కెట్‌లో పెద్ద సినిమాల పోటీ లేకపోవడం, కుటుంబ ప్రేక్షకుల మద్దతు కొనసాగుతుండటం 'పెద్ది'కి అదనపు బలంగా మారింది. ఈ చిత్రంలో రామ్ చరణ్ నటనకు ప్రేక్షకులతో పాటు విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు లభిస్తున్నాయి. పాత్రలో ఆయన చూపించిన భావోద్వేగాలు, క్రీడాకారుడిగా చేసిన పరివర్తన సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. దర్శకుడు బుచ్చిబాబు సానా కథను తెరకెక్కించిన తీరు కూడా ప్రత్యేక ప్రశంసలు అందుకుంటోంది. 'పెద్ది' బాక్సాఫీస్ ప్రయాణం ఇంకా కొనసాగుతుండటంతో, రాబోయే రోజుల్లో మరిన్ని రికార్డులు సృష్టించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పుడు అందరి దృష్టి రూ. 400 కోట్ల క్లబ్‌పై నిలిచింది. ఈ మైలురాయిని సినిమా ఎంత వేగంగా చేరుకుంటుందో చూడాలి.

# తన పేరుతో సైబర్ మోసాలు.. నకిలీ నంబర్‌ను షేర్ చేస్తూ అభిమానులను హెచ్చరించిన హీరోయిన్ మీనాక్షి చౌదరి!




'లక్కీ భాస్కర్' సినిమా ఘనవిజయంతో టాలీవుడ్‌లో మంచి క్రేజ్ సంపాదించుకున్న కథానాయిక మీనాక్షి చౌదరి తాజాగా ఒక పెద్ద సైబర్ మోసంపై స్పందించారు. తన పేరుతో కొందరు కేటుగాళ్లు ప్రజలను, అభిమానులను బురిడీ కొట్టించడానికి ప్రయత్నిస్తున్నట్లు ఆమె గుర్తించారు. తనలా నటిస్తూ మోసాలకు పాల్పడుతున్న ఒక గుర్తుతెలియని వ్యక్తి వ్యవహారాన్ని సోషల్ మీడియా వేదికగా బయటపెడుతూ ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సదరు నకిలీ వ్యక్తి వాడుతున్న ఫోన్ నంబర్‌ను స్క్రీన్ షాట్ తీసి తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో మీనాక్షి పోస్ట్ చేశారు. ఈ నంబర్ నుండి ఎవరికైనా మెసేజ్‌లు లేదా ఫోన్ కాల్స్ వస్తే నమ్మవద్దని, వెంటనే ఆ నంబర్‌ను బ్లాక్ చేసి రిపోర్ట్ చేయాలని కోరారు. అది తన నంబర్ కాదని స్పష్టం చేసిన ఆమె, ఈ మోసాన్ని సకాలంలో గుర్తించి తన దృష్టికి తీసుకువచ్చిన నెటిజన్లకు, అభిమానులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఇక సినిమాల విషయానికి వస్తే, మీనాక్షి చౌదరి ప్రస్తుతం టాలీవుడ్‌లో వరుస క్రేజీ ప్రాజెక్ట్‌లతో ఫుల్ బిజీగా ఉన్నారు. అందులో ముఖ్యంగా అక్కినేని నాగచైతన్య కథానాయకుడిగా నటిస్తున్న 'వృషకర్మ' చిత్రంపై సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. కార్తీక్ దండు దర్శకత్వంలో మైథలాజికల్ థ్రిల్లర్ నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కుతోంది.



# 'మా ఇంటి బంగారం'కు బాక్సాఫీస్ దగ్గర బిగ్ అడ్వాంటేజ్.. సమంత సినిమాకు పోటీ తగ్గిందా?

స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు ప్రధాన పాత్రలో నటిస్తున్న 'మా ఇంటి బంగారం' సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. దర్శకురాలు నందిని రెడ్డి తెరకెక్కించిన ఈ లేడీ ఓరియెంటెడ్ చిత్రంపై ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల విడుదలైన పోస్టర్లు, టీజర్, ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచాయి. అయితే ఇప్పుడు ఈ చిత్రానికి బాక్సాఫీస్ పరంగా మరో భారీ ప్లస్ పాయింట్ దక్కినట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మొదట 'మా ఇంటి బంగారం' విడుదల సమయంలో కొన్ని క్రేజీ సినిమాలు కూడా బరిలోకి దిగనున్నట్లు వార్తలు వినిపించాయి. ముఖ్యంగా అక్కినేని హీరో నటిస్తున్న 'లెనిన్' సినిమా అదే సమయంలో విడుదలవుతుందని భావించారు. అయితే తాజా సమాచారం ప్రకారం ఆ చిత్రం విడుదల వాయిదా పడే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ప్యాచ్ వర్క్ పూర్తికాకపోవడం, థియేట్రికల్ బిజినెస్‌కు సంబంధించిన చర్చలు ఇంకా కొనసాగుతుండటంతో నిర్మాతలు విడుదల తేదీపై పునరాలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. సినీ వర్గాల సమాచారం మేరకు 'లెనిన్' జూన్ చివరి వారానికి బదులుగా జూలైలో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. ఒకవేళ అదే జరిగితే 'మా ఇంటి బంగారం'కు బాక్సాఫీస్ వద్ద పెద్దగా పోటీ ఉండకపోవచ్చని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ముఖ్యంగా తొలి రెండు వారాల పాటు ప్రేక్షకుల దృష్టిని పూర్తిగా ఆకర్షించే అవకాశం ఈ చిత్రానికి లభించవచ్చని భావిస్తున్నారు. సినిమా విడుదలైన మొదటి వారంలో పాజిటివ్ టాక్ అందుకుంటే, రెండో వారంలో కూడా వసూళ్ల పరంగా బలంగా నిలిచే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో పెద్ద సినిమాల పోటీ తగ్గడం సమంత సినిమాకు అదనపు బలంగా మారిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. హాలీవుడ్ యాక్షన్ క్లాసిక్ 'కిల్ బిల్' తరహా యాక్షన్ ఎలిమెంట్స్‌ను తెలుగు కుటుంబ కథాంశంతో మేళవించి ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు ప్రచారం జరుగుతోంది. అలాగే పాత్రలో రెండు భిన్న కోణాలు ఉండనున్నాయని, అవి కథలో కీలక మలుపులకు కారణమవుతాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో సమంత అభిమానుల్లో సినిమాపై మరింత ఆసక్తి పెరిగింది. ఈ చిత్రం సమంత కెరీర్‌లో కూడా ఎంతో కీలకమైనదిగా భావిస్తున్నారు. ఎందుకంటే స్టార్ హీరోల సహకారం లేకుండా పూర్తిగా ఆమె ఇమేజ్, నటన, కథ బలంపై సినిమా రూపొందుతోంది. లేడీ ఓరియెంటెడ్ జానర్‌లో భారీ స్థాయిలో తెరకెక్కిన ఈ చిత్రం విజయవంతమైతే సమంత కెరీర్‌లో మరో మైలురాయిగా నిలిచే అవకాశం ఉంది.

Printed Published, Owned by PEMBI MAHENDHAR Printed at Saketh Publications, 312. Trinetra Complex, Sangareddy, Telangana 502001.
Published from 11-65/49, PEDDAMMAWADA, MALLAPUR, JAGITIAL, TELANGANA - 505331. PH: 9912484184.
Email : navageetamnews@gmail.com PRGI.NO:TGTEL/26/A2002. EDITOR: PEMBI MAHENDHAR.